


# విద్యా రుణాలు మంజూరు చేయాలి

## - బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు

తిరుపతి కలెక్టరేట్, జూన్ 13 ప్రభాతవార్త : వార్షిక జీవనోపాధి ప్రణాళిక ప్రకారం డిజిటల్ ఎంసిపీ ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటి సమావేశం ఛైర్మన్ హోదాలో జిల్లా కలెక్టర్, ఆర్.బి.ఐ ఎల్డీఎం గిరిధర్,ఎల్డీఎం గుంటూరు రవికుమార్, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ సామంచి శర్మ, వివిధ బ్యాంకు అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక జీవనోపాధి ప్రణాళిక ప్రకారం డిజిటల్ ఎంసిపీ ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. విద్యా హబ్ అయినా తిరుపతి జిల్లాలో పలు విశ్వ విద్యాలయాలు ఉన్నాయని విద్యకు సంబంధించిన రుణాల విషయంలో ప్రత్యేక ప్రాధాన్యత నిస్తూ రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. రుణాలు ఇవ్వడ ంలో ప్రైవేట్ బ్యాంకులు వెనుకబడి ఉన్నాయని, ఎలాంటి జాప్యం లేకుండా ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు స్వయం సహాయక సంఘాలకు, విద్యార్థు లకు విద్యా రుణాలు ఇవ్వాలన్నారు. అంతే కాకుండా డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఆయా బ్యాంకు జిల్లా అధికారులతో కలిసి అనువల్ క్రెడిట్ ప్లాన్ తిరుపతి 2025-26 సంబంధించిన బుక్ రిలీజ్ చేశారు. ఈ సమావేశంలో నాబర్డ్ డీడీఎం సునీల్, డీఆర్‌డీఏ పి.డి శోభన్‌బాబు, మెప్మా పీడీ రవీంద్ర, బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అనువల్ క్రెడిట్ ప్లాన్ తిరుపతి 2025-26 సంబంధించి బుక్‌ను రిలీజ్ చేస్తున్న జిల్లా కలెక్టర్

# తిమ్మోజిపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## - ముగ్గురు మృతి, నలుగురికి గాయాలు



తిమ్మోజిపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు
-మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

బంగారుపాళ్యం, జూన్ 13 ప్రభాతవార్త: బంగారుపాళ్యం మండలం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి తిమ్మోజిపల్లి వద్ద శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, నలురుగు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా వుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో పలమనేరు పట్టణం ఆర్‌కె వీధికి చెందిన సయ్యద్ దిలీప్(54), మండలంలోని తిమ్మోజిపల్లి గ్రామంకు చెందిన వి.రాజేంద్రనాయుడు(53), తిమ్మోజిపల్లి దళితవాడకు చెందిన సాదరయ్య(32)లు మృతి చెందాడు. వీరితో పాటు ఈ ప్రమాదంలో ముబీనా(45), ఫాతిమా(25), సహద్(6 నెలలు), సాహిద్ ఆలీ(27)లు గాయపడ్డారు. పలమనేరు పాతపేటకు చెందిన సయ్యద్ దిలీప్‌కు శుక్రవారం ఉదయం గుండెపోటు వచ్చింది. ఈ విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే మెరుగైన చికిత్స కోసం చిత్తూరుకు తరలించడానికి అల్లుడు సయ్యద్ ఆలీకి సమాచారం అందించారు. సయ్యద్ ఆలీ తన సొంత కారు తీసుకువచ్చి మామ సయ్యద్ దిలీప్‌తో పాటు అత్త ముబీనా, భార్య ఫాతిమా, కుమార్తె సహద్‌లతో కలిసి చిత్తూరుకు బయలుదేరారు. మెరుగైన వైద్యం అందించాలనే దిశగా కారును అతివేగంగా సయ్యద్ అలీ నడుపసాగాడు. అదే సమయంలో తిమ్మోజిపల్లికి చెందిన రాజేంద్రనాయుడు జాతీయ రహదారి ప్రక్కన వున్న తన పొలం వద్దకు వచ్చాడు. అలాగే దళితవాడకు చెందిన సాదరయ్య సైతం వాకింగ్ చేస్తూ రాజేంద్రనాయుడుతో రహదారి ప్రక్కన నిల్చుని మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో అతి వేగంగా వస్తున్న కారు వీరిద్దరిని ఢీకొంది. ఆ సమయంలో సయ్యద్ ఆలీ కారును అదుపు చేయలేక సమీప మామిడి తోటలోకి కారు దూసుకెళ్ళి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో రాజేంద్రనాయుడు రోడ్డుపైన పడటంతో తీవ్ర గాయాలకు లోనై అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే కారు వెనుక సీటులో కూర్చొని వున్న సయ్యద్ దిలీప్ సైతం మృత్యువాత పడి కారులో ఇరుక్కుపోయాడు. కారులో ప్రయాణిస్తున్న ముబీనా, ఫాతిమా, సహద్, సాహిద్ ఆలీతో పాటు సాదరయ్య తీవ్ర గాయాలకు లోనయ్యారు. గాయపడిన వీరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల స్వగ్రామాలు సమీపం కావడంతో గ్రామానికి చెందిన గ్రామస్తులు, బంధువులు, సన్నిహితులు, అధిక సంఖ్యలో సంఘటనా స్థలంకు చేరుకున్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాదరయ్య మృతి చెందాడు. సంఘటనా స్థలం, ఆసుపత్రుల వద్ద మృతుల బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి. రాజేంద్రనాయుడు భార్య తన భర్త మృతదేహంపై పడి బోరున విలపించడంతో పలువురు కంటతడి పెట్టారు. కాగా మృతుడు రాజేంద్రనాయుడు మండల తెలుగు రైతు విభాగ మాజీ అధ్యక్షుడుగా తెలుగు దేశం పార్టీకి సేవలు అందించారు. ఈ విషయం తెలిసిన వెంటనే జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షులు ఎన్‌పి జయప్రకాష్, మండల తెలుగుదేశం అధ్యక్షుడు ఎన్‌పి ధరణి, కార్యదర్శి జనార్ధన్ గౌడు, పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు సంఘటనా స్థలం చేరుకున్నారు. సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు మృత దేహాలను శవ పరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### హోస్కోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో...

# ఆళ్ళమడుగుకు చెందిన ఇద్దరు దుర్మరణం

## - గాయపడ్డవారిని పరామర్శించిన ఎమ్మెల్యే థామస్ అనుచరులు


నుజ్జునుజ్జు అయిన ఆర్‌టిసీ బస్సు

వెదురుకుప్పం, జూన్ 13 ప్రభాతవార్త : చిత్తూరు నుండి బెంగుళూరు వెళ్ళున్న ఏపీఎస్ఆర్‌టిసి చిత్తూరు రెండవ డిపోకు చెందిన బస్సు కర్ణాటక రాష్ట్రం హోస్కోట వద్ద ప్రమాదంకు గురికావడంతో గంగాధర నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం పరిధిలోగల ఆళ్ళ మడుగుకు చెందిన ఇద్దరు దుర్మ రణం చెందారు. అలాగే పలువురికి గయాలైన్నాయి. దీంతో వెదురుకుప్పం మండలంలో విషాదం అలు ముకుంది. గురువారం రాత్రి పది గంటల ప్రాంతంలో చిత్తూరు నుంచి బయలుదేరిన ఆర్టీసీ బస్సులో బెంగుళూరుకు మండలంలోని ఆళ్ళ మడుగుకు చెందిన కేశవులరెడ్డి కుటుంబ సభ్యులు ఆరుగురు, నచ్చుకూరు గ్రామంకు చెందిన మధన్‌రెడ్డి కుటుంబ సభ్యులు ముగ్గురు వెళ్ళిన్నట్లు తెలుస్తోంది. కాగా శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో బస్సు ప్రమాదం సంభవించడంతో ఆళ్ళమడుగుకు చెందిన కేశవులరెడ్డి ఆలియాస్ పెద్దబ్బరెడ్డి(44), ఆయన తమ్ముడి కుమారుడు ఏక్రాంత్ రెడ్డి(రెండునెలలు) అక్కడిక్కడే మృతి చెందిన్నట్లు చెప్పారు. నచ్చుకూరుకు చెందిన మధన్‌రెడ్డి, ఆయన కుమారుడికి స్వల్పగాయాలు కాగా మధన్‌రెడ్డి భార్య ధనకు రెండు కాళ్ళు తీవ్రంగా గాయాలైన్నట్లు చెప్పారు. గాయపడ్డవారిని హోస్కోట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించి చికిత్స చేయిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎస్ఆర్.పురం మండలం పుల్లూరుకు చెందిన రమేష్ కుమార్తె తులసి, గంగాధర నెల్లూరు మండలం మారేడుపల్లెకు చెందిన శారద మృతిచెందన్నట్లు తెలిసింది. రోడ్డు ప్రమాదంలో 8మంది మృతి చెందగా 11 మందికి తీవ్ర గాయాలై హోస్కోట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.రోడ్డు ప్రమాదం సమాచారం తెలిసి స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర విఫ్ డాక్టర్ వియం.థామస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనుచరులు నియోజకవర్గం నాయకులు హరీష్‌యాదవ్, ఆళ్ళమడుగుకు చెందిన బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డిలు హోస్కోట ఆసుపత్రికి చేరుకుని డాక్టర్లతో, గాయపడ్డవారితో చరవాణిలో ఎమ్మెల్యేతో మాట్లాడించిన్నట్లు చెప్పారు.

# నీట మునిగిన విద్యార్థి మృతదేహాం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐ

తొట్టంబేడు,జూన్ 13 ప్రభాతవార్త : తొట్టంబేడు మండలం కన్నలి గ్రామం వద్ద గురువారం ఈతకు దిగి గల్లంతైన యువకుడు మురళికృష్ణ మృతి చెందాడు మృతదేహాం లభ్యమైనట్లు శుక్రవారం టూటౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు దళిత వాడకు చెందిన ముగ్గురు మిత్రులు సరదాగా ఈతకు కన్నలి వద్ద ప్రవహిస్తున్న తెలుగుగంగ కాలువ వద్దకు వెళ్లారు.ముగ్గురు నీటిలో దిగారు.నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో మురళి కృష్ణ గల్లంతయ్యాడు.ఇద్దరు స్నేహితులు బయట పడ్డారు. అయితే శుక్రవారం మృతదేహాం కాలువలో పడిన చోటు నుంచి సుమారు ౦రెండు కిలో మీటర్ల దూరంలోని కల్లిపూడి సమీపంలో లభ్యమైనట్లు సిఐ వివరించారు. ఏమయ్యాడో అని రాత్రంతా గాలించామన్నారు. శుక్రవారం కాలువలో శవమై దొరికాడని తెలిపారు. శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

**మనస్థాపంతో :**

తెలుగుగంగ కాలువలో ఈతకు వెళ్ళిన ముగ్గురు స్నేహితుల్లో ఒకడు గల్లంతు కావటంతో మరో స్నేహితుడు మనస్థాపం చెంది సమీపంలోని దుకాణంలో పరుగుల మందు కొనుగోలు చేసిన తాగినట్లు సమాచారం. ఆతని పరిస్థితి గమనించి గ్రామస్తులు ఆతన్ని శ్రీకాళహస్తిలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స జరిపి తిరుపతికి తరలించినట్లు సమాచారం ఆతని పరిస్థితి ఆందోళన కరంగా ఉన్నట్లు తెలిసింది. మరో స్నేహితుని పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమాచారం.

**గంగ కాలువలో దిగకండి:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలో ప్రవహిస్తున్న తెలుగుగంగ కాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుందని ఎవ్వరు కూడా ఈతకు సరదాగా కాలువలో దిగరాదని సిఐ నాగార్జున్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

# ఐదేళ్ళ నాటి జియోగ్రాఫీ సర్వే అమలు!

## రిజిస్ట్రేషన్ విలువతో పన్నులు -పెరిగిన ఇంటి పన్నులు - లబోదిబోమంటున్న చెల్లింపుదారులు

**రాష్ట్రంలోని మున్సిపాలిటిల్లో ఐదేళ్ళ క్రితం నిర్వహించిన జియో గ్రాఫీ సర్వే అమలుతో పన్ను చెల్లింపు దారులు లబోదిబో అంటున్నారు. మున్సిపల్ పరిధిలో ప్రభుత్వాలు ప్రజల ముక్కుపిండి పన్ను వసూళ్ళకు నిర్ణయాలు తీసుకుంటున్నారు. దాంతో ఒక్కసారిగా పన్ను బాదుడుతో జనం తల్లడిల్లుతున్నారు. గత ప్రభుత్వ హాయంలో ఏటా 15శాతం పన్ను పెరుగుతూ వచ్చేసాఫ్ట్ వేర్‌ను రూపొందించి అమలు చేసారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ విలువలను లింక్ చేసి పన్నుల వసూళ్ళకు నిర్ణయించారు.దాంతో ఒక్కసారిగా పన్నులు 300 నుంచి 400శాతం పెరిగాయి.సర్వేలు ఎప్పటివైపా నేడు అమలు జరుగుతుంది కాబట్టి ఈ ప్రభావం ప్రస్తుత ప్రభుత్వంపై పడుతుంది.**



శ్రీకాళహస్తి, జూన్ 13 ప్రభాతవార్త: గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆస్తిపన్ను చెల్లింపుదారులు లబోదిబోమన్నారు. ఇప్పటికే ప్రతి ఏటా ఇంటి పన్నులపై 15% మరియు 30% పెంచుతూ పన్ను చెల్లింపుదారులను దిక్కుతోచని స్థితిలో నిలబెట్టారు. అయితే ప్రతి ఏటా యథావిధిగా 15%పెంచడమే కాకుండా డిమాండ్ రూ. 1.97కోట్లు పెంచవలసినదిగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. ఇప్పటికే శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో ఆస్తి పన్ను డిమాండ్ రూ.10కోట్లు కాగా మరో రూ.2కోట్లు పెంచుకోవాలని ఆదేశించటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.గతంలో తుడా ఒక సర్వే జరిపారు. దాంతో పట్టణంలో పన్నుల విధింపులో అధికారులు,సిబ్బంది చేతి వాటం జరిగిందని పేర్కొన్నారు. రెండు సంవత్సరాల క్రితం జిఐ సర్వే జరిపి శ్రీకాళహస్తిలోని 19883 డిమాండ్లు ఉన్నాయని అయితే తక్కువ పన్నులు చెల్లిస్తున్న బడాబాబులు 871 మంది ఉన్నారని నివేదిక ఇచ్చారు. ఇక కాలనీలు పెరుగుతున్నాయి కానీ పన్నుల వేయటం లేదు.

**రక రకాల నిబంధనలతో పన్నులు:**

గతంలో ఇళ్ళు నిర్మించుకున్నపుడు పన్నుల విధానం లోపభూయిష్టంగా ఉందని దాంతో ఒక్కొక్క ప్రభుత్వం ఒక్కొక్క విధానంతో పన్నుల వసూళ్ళకు ఆదేశిస్తున్నారు.ఈ నేపధ్యంలో ప్రస్తుతం పన్నుల పెంపుకు కారణాలు రక రకాలుగా చెబుతున్నారు. కొందరికి ఏమో ప్లాన్లు లేకపోవటం అని చెబుతున్నారు. సాధారణంగా ఇల్లు నిర్మించుకునే వారికి టౌన్ ప్లానింగ్ విభాగం పన్ను విధించరు.అయితే బహుళ అంతస్థులు నిర్మించుకునే వారు బ్యాంకుల్లో రుణాల కోసం ప్లాన్‌ను తీసుకుంటారు. అయితే మున్సిపల్ అధికారులకే శ్రీకాళహస్తి మున్సిపాలిటి స్థాయిలో ఎంత మందికి ప్లాన్స్ అప్రూవల్‌లో ఇళ్ళు నిర్మించుకున్నారన్నది. అలాంటి వారికి ప్రస్తుత వడ్డింపుల్లో భారీగా పెరిగింది. ఇక శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో మొత్తం డిమాండ్లు సుమారు 20వేలు ఉంటే ఇందులో ప్లాన్ అప్రూవల్ కేవలం 1533కి మాత్రమే.పన్నులు అయితే ప్రతి ఇంటికి వేస్తారు కానీ ప్లాన్ వద్దకు వచ్చినపుడు డికెటిలు ఆక్రమణలకు వేయమంటూ అధికారులు చెబుతున్నారు.

**పన్నులు వసూలు అయితే ఇక అభివృద్ధి:**

ప్రతి మున్సిపాలిటీ ఇక పన్నులు వసూలు చేసి అభివృద్ధి చేసుకోవాల్సిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక ఇంటి పన్నులు,కొళాయి పన్నులు, ఖాళీ జాగా పన్నులు,ఇతర పన్నులు వసూలు చేసి పురపాలక సంఘ అభివృద్ధి పనులు నిర్వహించు కోవాల్సిందే. అయితే ప్రతి ఏడాది పన్నులు పెంచుకుంటూ పోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. శ్రీకాళహస్తి పట్టణం ఇటు దక్షిణ కైలాసనగర్, రాజీవ్‌నగర్, అటు పానగల్, మిట్టకండ్రిగ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే ఇళ్ళ నిర్మాణాలు విస్తారంగా చేపట్టారు. గతంలో ఇళ్ళు పూర్తిస్థాయిలో నిర్మాణం అయినప్పుడు మాత్రమే ఇంటి పన్నులు విధించడం జరుగుతుంది.

**అధికారుల వివరణ:**

దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరగా, జిఐఎస్ సర్వేలో గుర్తించబడిన పన్నులకు మరియు అదనంగా కట్టడములు జరిగిన అసెస్‌మెంట్లకు మాత్రమే పన్నులు పెరుగుతున్నాయని, గతంలో కట్టుబడి వరకు మాత్రమే విధించిన పన్నులు నేడు ఆ ఇంటికి సంబంధించిన మొత్తము స్థలము మీద విధించడం జరుగుతున్నదని తెలియజేశారు. కానీ నేడు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇళ్ళు నిర్మాణంలో వున్నా, అసంపూర్తిగా వున్నా కూడా ఇంటి పన్నులు విధించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. పన్నుల పెంపుదల విషయంలో ప్రజలు కూడా సహకరించాలని సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు.

# అయ్యవారి ఇంటి సేవ చేయడమే విధులు

## - ఇది జిల్లా బిసీ సంక్షేమశాఖ ఔట్ సోర్సింగ్ సిబ్బంది పనితీరు



చిత్తూరు, జూన్ 13 ప్రభాతవార్త: ప్రభుత్వ కార్యాలయాలు, సంక్షేమ హాస్టళ్ళలో విధులు నిర్వర్తించాల్సిన కొంతమంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఈ విధులను సక్రమంగా నిర్వర్తించకుండా కొంతమంది శాఖల ఉన్నత అధికారుల ఇంటి సేవలో తరిస్తున్నారు. జిల్లా బిసీ సంక్షేమ శాఖ అధికారి వారి ఇంటి సేవలో సుమారు ఆరు మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది నిత్యం తరిస్తుండటం, వీరు నిర్వర్తించడాల్కిస విధులు సక్రమంగా నిర్వర్తించకుండా నిత్యం ఉన్నత అధికారి ఇంట్లో వుండి వారికి అవసరమైన సేవలు చేస్తుండటంతో ఆరోపణలు మిన్నంటుతున్నాయి. జిల్లా బిసీ సంక్షేమశాఖ కార్యాలయ పరిధిలో చిత్తూరు పరిసరాల్లో ఆరు మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ముగ్గురు జిల్లా బిసీ సంక్షేమశాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా, ఒకరు జిల్లా బిసీ భవన్, మరొకరు బిసీ సంక్షేమ హాస్టల్, ఇంకొకరు సమీపంలోని బిసీ సంక్షేమ హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో జిల్లా బిసీ సంక్షేమ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఔట్ సోర్సింగ్ అటెండర్లలో కనీసం రోజులో ఒక్కరైనా ఆఫీసు పనులకు దుమ్మా కొట్టి జిల్లా బిసీ సంక్షేమ అధికారి ఇంట్లో అవసరమైన పనులు చేస్తూ ఆ ఇంటి సభ్యుల సేవలో తరిస్తున్నారు. అలాగే జిల్లా బిసీ భవన్‌లో విధులు నిర్వర్తించడానికి ఔట్ సోర్సింగ్ కింద ఒక అటెండర్‌ను నియమించారు. ఇతను నిత్యం జిల్లా బిసీ భవన్‌లో అందుబాటులో వుండాల్సివుంది. అయితే జిల్లా బిసీ సంక్షేమశాఖ అధికారి ఇతనిని డ్రైవర్‌గా నిర్వర్తించాలని చెప్పి తాను ఎక్కడికి వెళ్ళినా అక్కడికి వాహనంతో పాటు తీసుకెళ్ళిపోతున్నారు. ఇతను జిల్లా బిసీ భవన్‌లో నెలలో ఒక రోజు సైతం విధులు నిర్వర్తించడం లేదని నిత్యం ఇతను జిల్లా బిసీ సంక్షేమ అధికారి వాహనానికి డ్రైవర్‌గా వుంటూ జిల్లా బిసీ భవన్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నుండి ప్రతి నెల జీతం తీసుకుంటున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే ఈ డ్రైవర్ భార్య సమీపంలోని బిసీ సంక్షేమ హాస్టల్‌లో వంట మనిషిగా విధులు నిర్వర్తిస్తుంది. అయితే ఆమె ఎప్పుడు వెళ్ళినా హాస్టల్‌లో వుండదు. ఆమె నిత్యం జిల్లా బిసీ సంక్షేమశాఖ అధికారి ఇంట్లో వుండి కుటుంబసభ్యులకు కావాల్సిన వంటలు సిద్ధం చేస్తుంటుంది. అంటే ఈమె బిసీ సంక్షేమ హాస్టల్ వంట పనిషిగా విధులు నిర్వర్తించకుండా జిల్లా బిసీ సంక్షేమశాఖ అధికారి ఇంట్లో వంట మనిషిగా విధులు నిర్వర్తిస్తూ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నెలకు 20 వేల వరకు జీతం తీసుకుంటున్నారు. అలాగే చిత్తూరు బిసీ సంక్షేమ హాస్టల్‌లో విధులు నిర్వర్తించానికి నియమితులైన అటెండర్‌ను సైతం ఈ అధికారి విడిచి పెట్టలేదు. ఈమెను సైతం రోజులో ఒక్కసారి ఇంటికి వచ్చి పనులు చేసిపెట్టి వెళ్ళాల్సిందిగా ఆదేశించడంతో ఆమె సైతం ప్రతి రోజు ఆ అధికారి ఇంటికి వెళ్ళి ఆ కుటుంబ సభ్యులకు అవసరమైన పనులు చేసిపెట్టి తిరిగి వచ్చి బిసీ సంక్షేమ హాస్టల్‌లో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో హాస్టల్‌లో విద్యార్థులు ఎవ్వరు లేకపోవడంతో ఆమె రోజులో ఎక్కువ సమయంలో ఆ అధికారి ఇంట్లో పనులు చేయ్యడానికే సమయం వెచ్చిస్తున్నది. జిల్లా బిసీ సంక్షేమశాఖలో ఔట్ సోర్సింగ్ సిబ్బందిగా విధులు నిర్వర్తిస్నున్న సిబ్బంది ఇకనైనా అధికారుల ఇళ్ళ వద్ద సేవలు చేయకుండా వారు నిర్వర్తించాల్సిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించి శాఖకు మంచిపేరు తీసుకురావాల్సిన అవసరం వుంది. అలాగే జిల్లా ఉన్నత అధికారి సైతం జిల్లా బిసీ సంక్షేమశాఖ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ అటెండర్ల విధులపై విచారించి తగు చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

# 17న ఏం తేలనుందో!

## -కల్తీనెయ్యి కేసులో కోర్టుతీర్పు ఏమిటని వేడివాడీ చర్చ




తిరుపతి,జూన్ 13ప్రభాతవార్త: తిరుమల శ్రీవారి లడ్డూల తయారీకి నకిలీ నెయ్యిసరఫరా చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఉత్తరాఖండ్ బోలేబాబా డెయిరీ పామాయిల్, రసాయనాలు, ముడిపదార్థాలతో తయారుచేసి సరఫరా చేసిందనే నిర్ధారణకు సిబిఐ సిట్ అధికారులు తేల్చారు. ఈ కేసులో ఇప్పటికే కీలకంగా ఉన్న ఆరుగురితో బాటు మరో 10మందివరకు నిందితులు అరెస్టయిన విషయం విదితమే. ఈ నకిలీనెయ్యి వ్యవహారంలో బోలేబాబాడెయిరీ షోమిల్‌జైన్ అనుచరుడు కోల్‌కత్తాలో నూనెల పరిశ్రమ నడుపుకుంటున్న పారిశ్రామిక వేత్త జ్యోతిష్‌ను సిబిఐ సిట్ అధికారులు విచారణ చేయడంతో మరిన్ని కీలక ఆధారాలు వెలుగుచూశాయి. ఈ కేసు ఇప్పుడు మరో ప్రధాన మలుపు తిరిగింది. టిటిడికి నకిలీనెయ్యిని ఆ డెయిరీ యాజమాన్యం తమిళనాడు లోని ఏఆర్‌డెయిరీ, వైష్ణవీడెయిరీ నుండి సబ్‌టెండర్లు దక్కించుకుని పూర్తిగా కల్తీచేసిన నెయ్యిని సరఫరాచేయడంలో ప్రధాన పాత్ర పోషించిందనేది సిట్ తేల్చింది. 2019-24మధ్య కాలంలో ఐదేళ్ళలో టిటిడికి అవసరమైన నెయ్యి సరఫరాకు టెండర్లు దాఖలు చేయాలని ప్రోత్సహించిన సూత్రధారులు ఇప్పుడు తెరపైకి రానున్నారు. అసలు ఆ డెయిరీ కార్యకలాపాలు తనిఖీ చేయకుండానే టిటిడి అధికారులు కాగితాలపైనే ఎలా అనుమతులిచ్చారనేది కీలకం కానుంది. ఇంకా టిటిడి మాజీ ఛైర్మన్ వ్యక్తిగత సహాయకుడు అప్పన్నను కూడా సిట్ విచారణ చేసి ఆధారాలు రాబట్టింది. 2022 సంవత్సరంలోనే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన డెయిరీలు మళ్ళీ నెయ్యిసరఫరాచేయడానికి ఎలా ,ఎవరు అంగీకరించా రనేది తేలాల్సిఉంది.దీనిపై ఈనెల 17వతేదీ హైకోర్టు ఏం తీర్పునివ్వనుందనేది టిటిడిలో వాడివేడిగా చర్చసాగుతోంది. కల్తీనెయ్యి బాగోతంలో సిబిఐ సిట్ అధికారులు గత పదినెలలుగా కీలకంగా లోతుగా చేపట్టిన దర్యాప్తులో ఇప్పుడు బాధ్యులైన పెద్దలకు నోటీసులు ఇస్తారనే ప్రచారం జరిగింది. అయితే సిట్ తనపని తాను చేసుకెళుతోంది. బోలేబాబాడెయిరీ, కోల్‌కత్తా జ్యోతిష్ మధ్య వాట్సాప్ చాటింగ్ వివరాలు సేకరించామన్నారు. అయితే ఈ విచారణను ఈనెల 17కు న్యాయస్థానం వాయిదా వేయడంతో టిటిడి నుండి ప్రభుత్వానికి చేరిన రిపోర్టులో కల్తీ నెయ్యి తప్పిదాలకు ఎవరు బాధ్యత వహిస్తారనేది వెల్లడికావలసిన విషయం. కీలక దశలోనే నిందితుల తరపున న్యాయవాదులు బెయిల్ మూవ్‌చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారనేది సిబిఐ తరపున న్యాయవాది బలంగా న్యాయస్థానానికి ఇప్పటికే తమ వాదనలు వినిపించారు. కల్తీనెయ్యి సరఫరా చేసిన కేసులో లోతుగా దర్యాప్తు చేస్తున్న సిబిఐ సిట్ అధికారులకు అసలు ఊహకు అందని రీతిలో జరిగిన గోల్‌మాల్ వ్యవహారంలో ఎవరి హస్తం ఉంది, దీనివెనుక ఉన్న గత టిటిడి అధికారులు,ధర్మకర్తలమండలి పెద్దలు ఎవరనేది ఇప్పుడు కీలకంగా వెలుగుచూడనుంది.

# ఐదుగురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

## - రూ.40 లక్షల విలువగల 34 ఎర్రచందనం దుంగలు, మోటారు సైకిళ్లు స్వాధీనం

తిరుపతి కార్పొరేషన్, జూన్ 13 ప్రభాతవార్త : కడప జిల్లా పాలకొండలు రిజర్వు ఫారెస్ట్ పరిధిలో 34 ఎర్రచందనం దుంగలతో పాటు రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని, ఐదుగురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ శ్రీ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణలో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ జె. బాలిరెడ్డి మార్గ నిర్దేశకత్వంలో ఆర్‌ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ కె. అల్లిబాషా టీమ్ గురువారం కడప జిల్లా ఫారెస్ట్ రేంజి అన్నా సముద్రం ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. శుక్రవారం ఉదయం మామిళ్లపల్లి బీట్ పరిధిలోని పాలకొండలు అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కనిపించారు. వారిని సమీపించడంతో వారు పారిపోడానికి ప్రయత్నించారు. అయితే టాస్క్ ఫోర్స్ పోలీసులు వారిని వెంబడించి ఐదుగురిని పట్టుకున్నారు. వారి నుంచి 34ఎర్రచందనం దుంగలు, వారు ఉపయోగిస్తున్న రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని కడప, అన్నమయ్య జిల్లా వాసులుగా గుర్తించారు. దుంగలు సహా పట్టుకున్న స్మగ్లర్లను తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగలు విలువ రూ. 40లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఎస్ ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో డీఎస్పీలు శ్రీనివాసులు రెడ్డి, ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.



## నేడు కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో మెగా జాబ్ మేళా



**కుప్పం, జూన్ 13 ప్రభాతవార్త :** కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఈనెల 14వతేది మెగా జాబ్ మేళా కార్యక్రమం జాబ్ ఫెయిర్ 2025 కనెక్ట్ 3.0 నిర్వహిస్తున్నట్లు కాలేజ్ ఛైర్మన్ బిసి నాగరాజ్ తెలిపారు. 30కు పైగా ఐటి, బ్యాంకింగ్, ఎడ్యుకేషన్ సెక్టార్, కోర్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు జరుపుతారన్నారు. దాదాపు 1500 ఉద్యోగాల కోసం ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిప్లమో, ఐటిఐ, డిగ్రీ, బిటెక్, ఎంబిఎ విద్యార్హతలు కలిగిన వారు ఈ ఇంటర్వ్యూకు హాజరు కావచ్చన్నారు. ఆయా సంస్థలు ఎంపికైన ఉద్యోగులకు వార్షిక వేతనం కింద సుమారు 8లక్షల దాకా చెల్లిస్తారన్నారు. ఇంటర్వ్యూలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో రావాలన్నారు. ఇతర వివరాలకు 9603929625, 8106128762 నెంబర్లను సంప్రదించాలన్నారు. 2001లో స్థాపించిన తమ కళాశాల అతితక్కువ కాలంలోనే ఉత్తమ కళాశాలల జాబితాలో చేరడంతో పాటు ఉద్యోగావకాశాల కల్పనలో ముందుండడంతో ఎపి ప్రభుత్వం ఎక్సలెన్సీ అవార్డును సైతం అందించిందని గుర్తు చేశారు.

## వినియోగంలో కొత్త మున్సిపల్ కార్యాలయం : కమీషనర్



**కుప్పం, జూన్ 13 ప్రభాతవార్త :** పట్టణం ప్యాలస్ రోడ్‌లో నిర్మించిన నూతన మున్సిపల్ కార్యాలయ భవనాలు వినియోగంలో తెచ్చి ఈనెల 16వతేది సోమవారం నుంచి కార్యకలాపాలు అక్కడే నిర్వహిస్తామని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు.ప్రజలు గమనించాలని కోరారు. నూతన మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వ, పురసేవలు ప్రజలు వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## గ్రామాల్లో టిటిడి ఇంజనీరింగ్ అధికారుల పర్యటన



**శాంతిపురం, జూన్ 13 ప్రభాతవార్త :** తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)కి చెందిన ఇంజనీరింగ్ అధికారుల బృందం మండలంలోని గ్రామాల్లో పర్యటిస్తోంది. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఉన్న గ్రామ దేవతల ఆలయాల అభివృద్ధికి సంబంధించి అధికారులు ఆలయాలను పరిశీలిస్తున్నారు. సుమారు 20-25లక్షలతో ఈ ఆలయాలను సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో అభివృద్ధి చేయనున్నట్లు తెదేపా నేతలు తెలిపారు. కార్యక్రమాల్లో టిటిడి డిఇఇ, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, సర్పంచ్ జనార్ధనరెడ్డి, మండల మాజీ వైస్ ఎంపిపి ఉదయ్‌కుమార్, నేతలు మణి, రమేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



**రామకుప్పం, జూన్ 13 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌ల ఆదేశాలతో శుక్రవారం విజలాపురం, ముద్దనపల్లి, రామకుప్పం పాఠశాలల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను తెదేపా నేతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, సీతాపతి, రామూర్తి, జయశంకర్, కృష్ణారెడ్డి, కడ సభ్యుడు రఘు, సలాంసాబ్, సుబ్రి, వెంకటాచలం,అవినాష్,మంజునాథ్, రాజసింహ, ఆంజనేయప్ప, హరీష్, కేశవరెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

## తూతూమంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

**వి.కోట, జూన్ 13 ప్రభాతవార్త:** వి.కోట మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం తూతూమంత్రంగా జరిగింది. ఉదయం 10గంటలకు మొదలు కావాల్సిన సమావేశం 11గంటలైనా ప్రారంభం కాలేదు. పలువురు మండల స్థాయి అధికారులు సమావేశంకు హాజరు కాలేదు. దీంతో ఎంపిపి యువరాజ్ ఆగ్రహించారు. అధికారులు సమయ పాలన పాటించాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల స్థానంలో కింది స్థాయి ఉద్యోగులు రావడంతో సర్పంచులు, ఎంపిటిసిలు మండిపడ్డారు. వేరుసెనగ విత్తనాల పంపిణీలో అర్హులైన రైతులకు పంపిణీ చేయలేదని సభ్యులు నిలదీశారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో అధికారులు నడుచుకోవడం తగదని జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. చెరువుల్లో అధికార పార్టీ నేతలు మట్టి తరలిస్తే అధికారులు పట్టించుకోరని సామాన్య రైతులు తరలిస్తే నిలుపుదల చేయడం తగదని డిటి శోభను ఎంపిపి నిలదీశారు. పంచాయతీరాజ్ శాఖ అధ్వర్యంలో సిసి రోడ్లు ధ్వంసం చేయడం తగదన్నారు. రీసర్వేలో రెవెన్యూ అధికారుల తప్పిదంతో రైతులకు అవస్థలు తప్పడం లేదని సర్పంచులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల బాగోగులు చూడకుంటే భరణం వసూలు

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి**



**చిత్తూరు, జూన్ 13 ప్రభాతవార్త:** వయోవృద్ధులైన తల్లిదండ్రుల బాగోగులను చూడనటువంటి కుమారులు, కుమార్తెల నుండి సెక్షన్ 125 కింద భరణం వసూలు చేయడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంఎస్ భారతి శుక్రవారం తపోవనం వద్ద వున్న వయోవృద్ధుల ఆశ్రమంను పరిశీలించి వయోవృద్ధులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిని దాన పత్రంతో కుమారులు, కుమార్తెలకు వ్రాయించడం జరిగిన అనంతరం కుమారులు, కుమార్తెలు తల్లిదండ్రుల బాగోగులు సరిగా పట్టించుకోనపుడు తల్లిదండ్రులు 144 కింద కోర్టును ఆశ్రయిస్తే వారు రాసి ఇచ్చిన దానపత్రంను రద్దు చేయడం జరుగుతుందన్నారు. అలాంటి వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో కేసు వేసిన వారికి సంబంధించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయ సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జడ్జి ఎంఎస్ భారతి వయోవృద్ధులను పరిశీలించి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్యలు వుంటే తెలపాలని వయోవృద్ధులను జడ్జి కోరారు. విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘ మాజీ అధ్యక్షుడు కేశవులు, మురళీ, డిజైబుల్ వెల్ఫేర్ వసతి గృహం స్టాఫ్ నర్స్ అరుణ, ఆశ్రమ నిర్వహన వయోవృద్ధులు, పాల్గొన్నారు.

## నేడు చిత్తూరుకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు

**చిత్తూరు, జూన్ 13 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెంనాయుడు శనివారం చిత్తూరు రానున్నారని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి అచ్చెంనాయుడు శుక్రవారం మధ్యాహ్నం 12.45 గంటలకు చిత్తూరు చేరుకుంటారని, మధ్యాహ్నం 2 గంటలకు గుడిపాల మండలం పల్లూరులోని ఫుడ్స్ అండ్ ఇన్స్ మామిడి పండ్ల గుజ్జు పరిశ్రమ వద్దకు చేరుకుంటారు. అలాగే మధ్యాహ్నం 3 గంటలకు మంత్రి అచ్చెంనాయుడు మంగసముద్రం మార్కెట్ యార్డు చేరుకుని రైతులు, పండ్ల గుజ్జు పరిశ్రమల యాజమానులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారని, ఆపై సాయంత్రం 3.30 గంటలకు మంత్రి తిరుమల బయలుదేరి వెళ్తారన్నారు.

## ఆకలితో అంగన్‌వాడీ పిల్లలు అలమటింపు

**పాలసముద్రం, జూన్ 13 ప్రభాతవార్త:** పాలసముద్రం మండలం నరసింహాపురం టివిఎన్ఆర్‌పురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్న పిల్లలు మధ్యాహ్నం అన్నం లేక ఆకలితో అలమటించారు. తమకు అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్నం భోజనం పెట్టకపోవడంతో ఆకలితో అల్లాడిపోతున్నామని ఇంట్లోనైనా అన్నం పెట్టాలని పిల్లలు వెళ్ళి ఇళ్ళలో అడగడంతో తల్లిదండ్రులు ఈ విషయంను అంగన్‌వాడీ ఆయాను ప్రశ్నిస్తే గ్యాస్ లేకపోవడంతో మధ్యాహ్నం వంట చేయలేదని సమాధానం ఇచ్చింది. గ్యాస్ అయిపోయిందని తీసుకురావాలని పలుమార్లు ఆశా వర్కర్‌కు చెప్పినా ఆమె తీసుకురాకపోవడంతో భోజనం చేయడం సాధ్యం కాలేదని ఆమె తల్లిదండ్రులకు సమాధానం ఇచ్చింది. ఈ ఘటనపై సీరియస్ అయిన సర్పంచ్ రమేష్ మధ్యాహ్నం 2 గంటల వరకు పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రంలో వుంచుకుని భోజనం పెట్టకుండా ఇళ్ళకు పంపితే ఎలాగని నిలదీశారు. పిల్లల పట్ల నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ ఆయా, ఆశా వర్కర్లను సత్వరం తొలగించాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేశారు. ఈ విషయంపై ఐసిడిఎస్ అధికారులు విచారించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు



**చౌడేపల్లి, జూన్ 13 ప్రభాతవార్త:** స్కూటర్‌ను కారు ఢీకొనడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. చౌడేపల్లి-తిరుపతి ప్రధాన రహదారిలో ఆమినిగుంట ఆర్చివద్ద అటుగా వెళుతున్న టూవీలర్‌ను చౌడేపల్లి వైపు వస్తున్న కారు ఢీకొన్నది. ఈప్రమాదంలో మండలంలోని శెట్టిపేట పంచాయతీ మేకలచిన్నేపల్లికి చెందిన అగిస్తప్ప(72)లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని చుట్టుపక్కల వారు స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ వృద్ధుడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో 108సేవల ద్వారా పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా అగిస్తప్ప ఎడమచేయి విరిగింది.

## వైష్ణవీమాతకు శుక్రవారం పూజలు



**చౌడేపల్లి, జూన్ 13 ప్రభాతవార్త:** పుదిపట్లలో గల స్వయంభు వైష్ణవీమాతకు శుక్రవారం విశేష పూజలు జరిగాయి. ప్రధానార్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ జలాలతో అభిషేకించి, రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్మాణదాత వినోద్‌కుమార్‌రెడ్డి భక్తులు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## ప్రజలకు అందుబాటులో వుండి పనిచేయాలి : తహశీల్దార్



**చౌడేపల్లి, జూన్ 13 ప్రభాతవార్త:** ప్రజలకు అందుబాటులో వుండి వారికి బద్దులుగా పనిచేయాలని తహశీల్దార్ హనుమంతు అన్నారు. స్థానిక కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలతో సమావేశం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కుల, ఆదాయ వంటి సర్టిఫికేట్‌లను త్వరితగతిన అందించాలన్నారు. వ్యతిరేక విధానాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

## ఐదుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ

**కల్లూరు, జూన్ 13 ప్రభాతవార్త:** పులిచెర్ల మండలంలో ఐదుగురు పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్లంకి వారి పల్లి పంచాయతీ కార్యదర్శి బాబు, మంగళంపేటకు చెందిన మంగళంపేట కార్యదర్శి నాగరాజు, 106 రామి రెడ్డిగారిపల్లికి, 106 రామిరెడ్డిగారిపల్లి కార్యదర్శి కళ్యాణి, ఐరాల మండలం గుండ్లపల్లె కార్యదర్శిగా దిగువ పోకల వారి పల్లె కార్యదర్శి రామకృష్ణ వెంకట దాసరి పల్లె కార్యదర్శిగా వెంకట దాసరపల్లి కార్యదర్శి రమణయ్య, దిగుపోకలవారిపల్లె పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు.

## సార్...వచ్చారు, వెళ్లారు

**- తోతాపురి ధర టన్ను 4 వేలు...**



**కల్లూరు, జూన్ 13 ప్రభాతవార్త:** పులిచెర్ల మండలంలో తోతాపురి మామిడి రైతులు ధర లేక నిండా నష్టపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తోతాపురికి రూ 12000 టన్నుకు ప్రకటించిన ఆ మేరకు కొనుగోలు జరగకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. మండలంలో ర్యాంపుల ద్వారా తోతాపురి ని కొనుగోలు చేస్తున్నారు. ర్యాంపులలో శుక్రవారం టన్ను 4000 రూపాయలకే కొనుగోలు చేశారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పరమేశ్వర్ ఎల్లంకి వారి పల్లి ర్యాంపును తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా కొనుగోలు చేయాలని ఆదేశించారు. అయితే అధికారి ఆదేశాలు అమలు కాలేదు. అయితే అధికారి వచ్చిన ర్యాంపులు మాత్రం టన్ను 5000 కే కొనుగోలు చేయడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం టన్ను 12 వేలు కొనాలని ఆదేశించడం ఇందులో ప్రభుత్వం టన్నుకు 4000 చెల్లిస్తామని చెప్పిన ఎక్కడ ఆదేశాలు అమలు కావడం లేదు. దీంతో రైతులు చేసేది ఏమీ లేక ర్యాంపులు చెప్పిన ధరకే మామిడికాయలు విక్రయిస్తున్నారు. అధికారులు తనిఖీ చేసిన ధర మాత్రం మార్పు లేదు. దీంతో రైతులలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

## రాయితీ విత్తనాలు దుర్వినియోగంపై ఆందోళన



**సోమల, జూన్ 13 ప్రభాతవార్త:** ఖరీఫ్ సీజన్లో వేరుశెనగ సాగు చేసే రైతులకు ప్రభుత్వం 100 సబ్సిడీతో అందించే వేరుశనగ విత్తనాలు పెత్తందారుల పాలయ్యాయని ఆరోపిస్తూ కందూరు గ్రామ రైతులు మరియు జనసేన నాయకులు ఆందోళన చేపట్టారు. మేలు జాతి వంగడం డెవలప్ చేసేందుకు కందూరు పంచాయతీకి వ్యవసాయ శాఖ 250 బస్తాలు పూర్తి రాయితీపై రైతులకు అంది ఇవ్వాలని మంజూరు చేశారు. విషయం తెలిసిన కొందరు పెత్తందారులు రాజకీయ ప్రమేయంతో పూర్తిగా వారి స్వాధీనం చేసుకుని వారికి అయిన వారికి మాత్రం పంపిణీ చేసి అయ్యాయని అనిపించారు. దీంతో ఆగ్రహించిన జనసేన నాయకులు రైతులు శుక్రవారం సోమల రైతు భరోసా కేంద్రం వద్ద ఆందోళన దిగారు. బినామీ పేర్లతో నాయకులే వేరుశనగ విత్తనాలను విక్రయించారని వారు ఆరోపించారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ వివరణ ఇస్తూ రైతుల దగ్గర డిక్లరేషన్ తీసుకొని పంపిణీ చేశామని తెలిపారు.

## బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదాం



**సదుం, జూన్ 13 ప్రభాతవార్త:** బాల కార్మిక వ్యవస్థ ను అందరూ సమిష్టిగా కృషిచేసి రూపుమాపుదామని పీలేరు సహాయ కార్మిక అధికారి జగదీష్ బాబు అన్నారు. శుక్రవారం సదంలోని పలు హోటల్లో, దుకాణాలలో ముమ్మరంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా జూన్ ఒకటో తేదీ నుంచి 30 తేదీ వరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలోమండల లీగల్ సర్వీస్ అథారిటీ పారా లీగల్ వాలంటీర్ గట్టప్ప, ఉపాధ్యాయులు శ్రీరాములు, హరినాథ్, రెడ్డప్ప, గ్రామ సచివాలయ మహిళా పోలీసులు ఆసియా, సరస్వతి, హెడ్ కానిస్టేబుల్ అమరనారాయణ, పాల్గొన్నారు.

## వ్యాయమం చేయడం వల్ల అధిక రక్తపోటు నివారణ




**సదుం, జూన్ 13 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు వ్యాయామం చేయడం వల్ల అధిక రక్తపోటును నివారించుకోవచ్చునని మండల ఆరోగ్య విస్తరణాధికారి ఉదయ భాస్కర్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకి విద్యార్థులకు వైద్యాధికారిణి గిరీష ఆధ్వర్యంలో అధిక రక్తపోటు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థుల చేత సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జయ్ కుమార్ రెడ్డి, సిహెచ్ఓ మనీషా, ఏఎన్ఎం రేవతి, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, యుగంధర్ పాల్గొన్నారు.

## మాజీ సిఎం రూపానీకి ఘన నివాళులు



**కుప్పంరూరల్, జూన్ 13 ప్రభాతవార్త :** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృతి చెందిన గుజరాత్ మాజీ సిఎం విజయ్‌రూపానీకి కుప్పంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తులసినాథ్ అధ్వర్యంలో నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. రూపానీ చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో నేతలు ఇంద్రశేఖర్, శ్రీహరి పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రోడ్డుపై నిరసన తెలిపిన తల్లిదండ్రులు



**పుంగనూరు రూరల్, జూన్ 13 ప్రభాతవార్త:** మండల పరిధిలో అనేక పాఠశాలలు రూపురేఖలు కోల్పోయాయని, గ్రామాలలో బడులు ఐదో తరగతి వరకు పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలల విలీనం పేరిట తమ గ్రామంలోని పాఠశాలలను మరో చోటుకు తరలించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. దీని వల్ల విద్యార్థులు ఇబ్బందికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

## పది ఉత్తమ విద్యార్థినులకు అవార్డులు




**పుంగనూరు రూరల్, జూన్ 13 ప్రభాతవార్త :** జడ్పీ బాలికొన్నతో పాఠశాలలో పదో తరగతి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు లయన్స్ క్లబ్ ఆఫ్ నోబెల్ ప్రోత్సాహకాలు అందించింది. శుక్రవారం ఈ మేరకు క్లబ్ నాయకులు త్రిమూర్తి రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో బాలికొన్నత పాఠశాల నుంచి పదవ తరగతిలో విశేష ప్రతిభ చూపించిన పలువురు విద్యార్థులను అభినందించారు. తరపున వారికి ప్రశంస పత్రము మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులు మరియు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు ఈ కేవైసీ తప్పనిసరి



**పుంగనూరు రూరల్, జూన్ 13 ప్రభాతవార్త :** రైతులకు ఈ కేవైసీ తప్పనిసరి అని ఎడి శివకుమార్ రాజు తెలిపారు. అర్హులైన రైతులు అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులుగా అర్హత సాధించేందుకు రైతు సేవ కేంద్రాలలో నమోదు చేసుకోవాలన్నారు. దీనివల్ల ప్రభుత్వం రైతులకు అందజేసే అనేక పథకాలు వాటి ఫలాలు సకాలంలో సమగ్రంగా అందేందుకు అవకాశం కేంద్రాలలో సిబ్బందితో సంప్రదించి తప్పక నాలుగు లేదా ఐదు రోజుల్లో నమోదు చేయించుకోవాలని, ఆలా చేయించుకొని రైతుల అకౌంట్ లోకి అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేయడం జరగదని తెలిపారు. ఇప్పటి వరకు పుంగనూరు నియోజకవర్గంలోని ఏడు మండలాలకు సంబంధించి చాలా మంది రైతులు పెండింగ్ ఉందని తెలిపారు.

## సన్నిధి మామిడి పరిశ్రమ వ్యర్థాలతో...

**రోగాల బారిన పడుతున్న ప్రజలు**



**పూతలపట్టు, జూన్ 13 ప్రభాతవార్త:** మండలం పాలకూర పంచాయతీ రెవెన్యూ పేటపల్లి గ్రామంలో యుందు సన్నిధి మామిడి గుజ్జు పరిశ్రమ లో మామిడి టెంకలను వ్యర్థాలను రోడ్డు పక్కనున్న పొలాలలో వేయడం వలన అధిక దుర్వాసనతో రోడ్డుపైన ప్రయాణించే ప్రయాణికులు స్థానికంగా పక్కన ఉన్న చుట్టుపక్కల ఉన్న గ్రామాలు ప్రజలు తీవ్రమైన అనారోగ్యాలకు గురవుతున్నారు. మరి వర్షం పడితే దోమలు, ఈగలు అధికం కావడం వలన విరోచనాలు జ్వరాలతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారు కావున స్థానిక రాత్రి వేళలో గ్రామాలకు వెళ్లాలన్న ద్విచక్ర వాహనాలు పోవడానికి ఇబ్బందులు గురవుతున్నారు. అధికారులు మండల అధికారులు దీనిపై చర్యలు తీసుకొని పరిశ్రమల యాజమాన్యానికి రహదారికి దూరంగా జనావాసాలకు దూరంగా డంప్ చేయాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



**కాణిపాకం, జూన్ 13ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయ కస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి భక్తుల లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు కడప జిల్లాకు చెందిన హిమబింధు, రామకృష్ణయ్య దంపతులు నిత్యాన్నదానంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని దాతలు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



**తవణంపల్లె, జూన్ 13 ప్రభాతవార్త:** మండలంలో గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా మండల తహశీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ మండలంలో శ్మశానాలు, శ్మశానాల దారి వంటివి లేకుంటే తన దృష్టి కి తీసుకువస్తే శ్మశానాలు, శ్మశాన దారులు ఏర్పాటు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే మండలంలో మామిడి రైతులకు ప్రభుత్వ తరపున గిట్టుబాటు ధర కల్పించేందుకు మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలతో జిలా యంత్రాంగం చర్చించి నిర్ణయించినట్లు తెలిపారు. కావున రైతులు పక్వానికి వచ్చిన మామిడి కాయలను మాత్రమే కోసి ప్యాక్టరీలకు తరలించి సహకరించాలని కోరారు. అలాగే మండలంలో రెవెన్యూ పరమైన సమస్యలు ఏవైనా వుంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకుపండ్ల తోటల పెంపకానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఏపీఓ బాలు తెలిపారు. ఈపథకాని న్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈసందర్భంగా ఆయా శాఖల వారిగా జరుగుతున్న అభివృద్ధిగురించి అధికారులు వివరించి సమీక్ష నిర్వహించారు.ఈసమావేశంలో హరిప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు శోభ, అనుసూయమ్మలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా విజయగణపతి కళ్యాణోత్సవం



**చౌడేపల్లి, జూన్ 13 ప్రభాతవార్త:** మండలంలోని ఆమినిగుంట పంచాయతీ శింగిరిగుంటలో గల ఆలయంలో సిద్ధి, బుద్ధి, విజయగణపతి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. సాయంత్రం జరిగిన ఊరేగింపు భక్తులను అలరించింది. యేటా ప్రతిష్టాత్మకంగా జరిగిన కళ్యాణోత్సవంలో ఉదయాన్నే ఆలయంలో గంగపూజ, సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామికి మహారుద్రాభిషేకం, సాయంత్రం గ్రామంలో ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు గ్రామ పెద్దలు, నిర్వాహకులు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి పవిత్ర తీర్థ ప్రసాదలందించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**శాంతిపురం, జూన్ 13 ప్రభాతవార్త :** విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 12గంటల

## అప్పులబాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్యా యత్నం



**చౌడేపల్లి, జూన్ 13 ప్రభాతవార్త** అప్పులబాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి చౌడేపల్లిలో చోటు చేసుకొంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు...చౌడేపల్లి పరిధిలోని గోసలకురపల్లికి చెందిన రమణ కుమారుడు ప్రకాష్(35) ఆమినిగుంట వద్ద స్కూటర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. వ్యాపారం కోసం పలు చోట్ల రుణాలు తీసుకొన్న అతను గ్యారేజీ జరగక పోవడంతో రుణదాతల నుంచి ఒత్తిళ్ళు రావడంతో తట్టుకోలేక సమీపంలోని పొలాల్లో వున్న పురుగుల మందును తాగాడు. అపస్మారక పరిస్థితిలో పడివున్న ప్రకాష్‌ను గుర్తించిన చుట్టుపక్కల వారు పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## ఆర్టీసీ మహిళాకండక్టర్ పై దాడి

**పుంగనూరు రూరల్, జూన్ 13, ప్రభాతవార్త**



పుంగనూరు ఆర్టీసీ డిపోలో మహిళా కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మమత పై ఒక వ్యక్తి దాడికి పాల్పడ్డారు. పుంగనూరు డిపో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మమత డ్యూటీ ముగించుకుని మినీ బైపాస్ రోడ్డులో వెళుతుండగా శుక్రవారం సాయంత్రం మురళి అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. రెండు రోజుల క్రితం పలమనేర్ పరిధిలో మురళి మహిళా కండక్టర్ మమత పై దానికి పాల్పడి దాదాపు 40 గ్రాముల బంగారు గొలుసు లాక్కెళ్ళినట్లు మహిళా కండక్టర్ మమత పలమనేరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కక్ష పెంచుకున్న మురళి ఆమెపై దాడి చేసినట్లు ఆమె వాపోయారు.

## పంచాయతీ సెక్రటరీ బదిలీలు, నియామకాలు

**సత్యవేడు, జూన్ 13 ప్రభాతవార్త:**

సత్యవేడు మండలంలో పలువురు పంచాయతీ సెక్రటరీలు బదిలీ కాగా వారి స్థానాల్లో కొత్తవారిని నియమించారు. ఇందులో భాగంగా నాగలాపురం మండలం బయటకొడియంబేడు పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్న ఉషారాణి బదిలీపై మండలంలోని కొత్తమారికుప్పం పంచాయతీ సెక్రటరీగా నియమితులు కాగా కేవీబీ పురం మండలంలో వగత్తూరు పంచాయతీ సెక్రటరీ చేస్తున్న మణికంఠ జడేరి పంచాయతీ సెక్రటరీగా, సీకే పురం పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్న మునిలక్ష్మి నరసరావు అగ్రహారం పంచాయతీ సెక్రటరీగా, రాయపేడు పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్న జయ ఆరూరు పంచాయతీ సెక్రటరీగా నియమితులయ్యారు. అలాగే బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఎస్ పురంలో పని చేస్తున్న రజనీకాంత్‌ని సిరుణంబుదూరు పంచాయతీ సెక్రటరీగా, పల్లమల పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్న మునికృష్ణ రేపల్లెవాడ పంచాయతీ సెక్రటరీగా నియమించారు. పుత్తూరు మండలం రామసముద్రం పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్న సుజాతను పుదుకుప్పం పంచాయతీ సెక్రటరీగా, శిరుగురాజుపాళెం పంచాయతీ సెక్రటరీ హరిత వా నెల్లూరు పంచాయతీ సెక్రటరీగా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం అనంతపురం పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్న మురళీమోహన్, దాసుకుప్పం పంచాయతీ సెక్రటరీగా, ఏర్పేడు మండలం మడిబాగా పంచాయతీ పని చేస్తున్న భువనేశ్వరి రాజగోపాల్ పురం పంచాయతీ సెక్రటరీగా, వరదయ్యపాళెం మండలం మతేరిమిట్ట పంచాయతీగా పని చేస్తున్న దేవల పద్మనాభరాజు, పెద్ద ఈటిపాకం పంచాయతీ సెక్రటరీగా, బత్తలవల్ల పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్న ఇందిర చెరివి పంచాయతీ సెక్రటరీగా నియమించారు. అలాగే నాగలాపురం మండలం త్రిపురాంతకపురం పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్న శైలేంద్ర కుమార్ పీవీ పురం పంచాయతీ సెక్రటరీగా, పిచ్చాటూరు మండలం షంషీర్ బహుదూర్‌పేట పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్న కె.ప్రకాష్‌ని మదనంబేడు పంచాయతీ సెక్రటరీగా, పాకాల మండలం ఉప్పరపల్లి పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్న లావణ్య కుమార్ అంబాకం పంచాయతీ సెక్రటరీగా, సత్యవేడు మండలం మల్లవారిపాలెం పడమర పంచాయతీగా పనిచేస్తున్న పి.హరీష్ మల్లవారిపాళెం తూర్పు పంచాయతీ సెక్రటరీగా, నరసరాజ అగ్రహారం పంచాయతీ సెక్రటరీ పని చేస్తున్న కుముద కాలమనాయుడు పేట పంచాయతీ సెక్రటరీగా నియమితులయ్యారు. సాధారణ బదిలీలో భాగంగా ఉన్నతాధికారులు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

## మద్యం మత్తులో యువకుడిపై హత్యాయత్నం



**తిరుపతి,జూన్ 13ప్రభాతవార్త:** నలుగురు స్నేహితులు మద్యం సేవించి మత్తులో మరో యువ కుడిపై హత్యాయ త్నానికి పాల్పడినట్లు అలిపిరి ఎస్ఐ లోకేశ్‌కుమార్ తెలిపారు. జీవకోనక్రాంతినగర్‌కు చెందిన కె.వెంకటరమణ కుమారుడు మణి(30) గురువారం సాయంత్రం జీవకోనలోని గుడివద్ద మద్యంసేవించి నిద్రిం చాడు. అక్కడకు జీవకోనకు చెందిన అతని స్నేహితులు బి.శివప్రసాద్‌రెడ్డి, దిలీప్‌కుమార్, కె.విజయకుమార్ వెళ్ళారు. అందరూ కలసి మద్యం సేవించి గొడవపడ్డారు. మాటామాటాపెరగడంతో మణిని హతమార్చాలని శుక్రవారం మధ్యాహ్నం మణి తలపై బలంగా కొట్టారు. చంపేందుకు ప్రయత్నంచేశారు. స్థానికులు గమనించి రుయాకు తరలించారు. రుయాలో అత్యవసరవిభాగంలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి తల్లి వసంత ఫిర్యాదు మేరకు ముగ్గురిపై హత్యాయత్నంనేరంక్రింద కేసు నమోదు చేసినట్లు అలిపిరి ఎస్ఐ లోకేశ్‌కుమార్ తెలిపారు.

## ఏర్పేడు వ్యవసాయశాఖాధికారిగా బి.సాగరిక



**శ్రీకాళహస్తిరూరల్, జూన్ 13 ప్రభాతవార్త:** సాధారణ బదిలీల్లో భాగంగా ఏర్పేడు మండల వ్యవసాయాధికారిగా బి.సాగరిక నియమితులైనారు. ఆమె గతంలో ఏర్పేడు అగ్రికల్చర్ అధికారిగా శుక్రవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. సాగరిక అన్నమయ్య జిల్లా సందేపల్లి మండల వ్యవసాయశాఖాధికారిగా పనిచేశారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఏర్పేడు మండలానికి బదిలీ అయ్యారు. ఏర్పేడులో పనిచేసిన షణ్ముగం బదిలీపై బుచ్చినాయుడు కండ్రిగ మండలానికి బదిలీ అయ్యారు.

## కొత్తకండ్రిగలో పొంగళ్ళు



**శ్రీకాళహస్తిరూరల్, జూన్ 13 ప్రభాతవార్త:** ఏర్పేడు మండలంలోని కొత్తకండ్రిగ గ్రామంలో శుక్రవారం శీతాలాంబ రేణుకెల్లమ్మ దేవతకు పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గ్రామదేవతకు విశేష అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఏర్పేడు మాజీ జెడ్పిటిసి తోటకూర కోటేశ్వరరావు, గ్రామపెద్దలు అర్జున్ నాయుడు, రామచంద్రనాయుడు, మునిరత్నం నాయుడు, సబ్బయ్య యాదవ్, వెంకట రమణారెడ్డి, జి.మునిరత్నంనాయుడు, సంజీవ్‌నాయుడు, గోవర్ధన్ నాయుడు, రవీంద్రబాబు, ప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులను వస్తుసామాగ్రి పంపిణీ



**శ్రీకాళహస్తిరూరల్, జూన్ 13 ప్రభతవార్త:** మండల కేంద్రమైన ఏర్పేడు గ్రామ పంచాయితీలోని పారిశుధ్య కార్మికులకు అవసరమైన వస్తు సామాగ్రిని అధికారులు అందజేశారు. గ్రామ పంచాయితీలో పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు ఏర్పేడు సర్పంచ్ నల్లపాళెం శివయ అధ్యక్షతన వారికి అందజేశారు. డ్రైనేజీ వ్యవస్థ, నీటి నిల్వలు, రోడ్లమీద చెత్తాచెదారం నిల్వలు లేకుండా చేయడంతో పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమన్నారు. కార్మికులను అవసరమైన యూని ఫారంతో పాటు బూట్లు, శానిటైజర్లు, సోపులు ఇతర సామాగ్రి అందించారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షురాలు గాలి క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌సరఫరాకు అంతరాయం

**శ్రీకాళహస్తి, జూన్ 13 ప్రభతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి పట్టణం, రూరల్, తొట్టంబేడు, ఏర్పేడు మండలాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతారయం కలుగుతుందని ఇఇ చిన్నరెడ్డప్ప తెలిపారు. రెండవ శనివారం సందర్భంగా శ్రీకాళహస్తి పరిధిలోని లైన్లు మరియు ట్రాన్స్‌ఫర్లు యొక్క మరమ్మత్తులు, నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతారయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ సరఫరా అంతారయంకు ప్రజలు సహకరించాలని తెలిపారు.

## ఎస్‌బిఐలో ప్రపంచ రక్తదాన శిబిరం



**శ్రీకాళహస్తి,జూన్ 13 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ మెయిన్ బ్రాంచిలో నిర్వహించిన క్యాంప్‌ను బ్రాంచి మేనేజర్ ఫణి కుమార్ ప్రారంభించారు. మొదటి డోనర్‌గా ఆయనే అందించారు. రెండు రోజుల క్యాంప్‌కు మొదటి రోజు బ్రాంచి ఖాతాదారులకు సదవకాశాన్ని కల్పించారు. ఈ కార్యక్రమాల్లో బ్యాంక్ సిబ్బంది సహకారం అభినందనీయం అని మేనేజర్ ఫణికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాలను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి సిబ్బంది ఎంఒ డాక్టర్ జి.మధు, ల్యాబ్‌టెక్నిషియన్లు ఎస్ తాజిద, ఎస్ విజయబాలాజి, వి.లక్ష్మణ్ సుభాష్‌లు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



**శ్రీకాళహస్తిరూరల్,జూన్ 13 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తికి సమీపంలో తిరుపతి–నాయుడుపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందినట్లు ఎస్ ఐ నరసింహారావు తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటలకు ఊరందూరు సమీపంలోని హైవే మీద బహుశా రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొన్నట్లు తెలిపారు. ఆమె వయస్సు సుమారు 60 సంవత్సరాలుంటుందని వివరించారు. బహుశా ఆమె ఆకుకూరలు, కూరగాయలు అమ్ముకొని జీవనం గడిపే మహిళగా ఉందని వివరించారు. ఏరియా ఆసుపత్రికి శవాన్ని తరలించి చుట్టుపక్కల గ్రామాలకు విచారించినా ప్రయోజనం లేదని ఎస్ఐ వివరించారు.

## ధర్మపాలకుడు చంద్రబాబు



**శ్రీకాళహస్తి,జూన్ 13 ప్రభాతవార్త :** అభివృద్ధి మరియు సంక్షేమం అనే రెండు అంశాలను సమన్వయం చేసుకుంటూ ఓ వైపు అప్పుల ఆంధ్రాను అభివృద్ధి ఆంధ్రాగా తీర్చి దిద్దుటకు కృషి చేస్తున్నారని బిసి విభాగం రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు అన్నారు. శుక్రవారం సుమారు 55లక్షల మంది మహిళల ఖాతాల్లో తల్లులకు వారి బ్యాంకు ఖాతాలకు నిధులు జమచేయటం ఆయనలోని జవాబుదారితనానికి నిదర్శనం అన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అవకాశం కల్పించుటకు సంకల్పించార న్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు మిన్నల్ రవి, మునిరాజా యాదవ్, కోట చంద్రశేఖర్, భీమాల భాస్కర్,మణి తదితరులు పాల్గొన్నారు.

## రెండవ రోజు కొనసాగిన యోగా శిక్షణ శిబిరం



**తిరుపతి కార్పొరేషన్, జూన్ 13 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో రెండవ రోజు దశదిన యోగా శిక్షణ శిబిరం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి జిల్లా పోలీసుశాఖ వారు డిపార్టమెంట్ ఆఫ్ శాంఖ్యయోగా యోగవిజ్ఞానం, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఇందిరా గాంధీ రాష్ట్రీయ కళాకేంద్రం యొక్క ప్రాంతీయ కేంద్రం వారు కలసి సంయుక్త ఆధ్వర్యంలో దశదిన యోగా శిక్షణ శిబిరాన్ని పోలిసు పెరేడ్ గ్రౌండులో పోలీసు ఉద్యోగుల కొరకై ప్రత్యేకముగా ఉదయం నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఈ దశదిన యోగా శిక్షణ శిభిరాన్ని శ్రీనివాస రావు, అదనపు ఎస్పీ ఆర్మడ్ రిజర్వుడ్, డా. కె.టి.వి రాఘవన్, రీజినల్ డైరక్టర్, ఇందిరా గాంధీ రాష్ట్రీయ కళాకేంద్రం, తిరుపతి, ప్రొఫెసర్ డి.జ్యోతి, ప్రొఫెసర్ లక్ష్మి నారాయణ, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం, మొదలగు వారు సంయుక్తంగా నిర్వహించారు. యోగ ప్రారంభ సభలో డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇది ఒక అరుదైన అవకాశమని, యోగాభ్యాసము ద్వారా శారీరక ధృడత్వమును పొందడమే కాకుండా మానసిక ఒత్తిడిని కూడా తొలగించుకోవచ్చని ముఖ్యముగా పోలీసు ఉద్యోగులు, యోగా చేయడం ద్వారా వారి విధులలో ఏకాగ్రతను పెంచుకొని మరింత మెరుగైనటు వంటి నైపుణ్యాన్ని ప్రదర్శించగలరని పోలీసులకు ఉద్భోధించారు. డా. కె.టి.వి రాఘవన్ మాట్లాడుతూ ఈరోజు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం యోగాంధ్ర ప్రదేశ్‌గా ఆవిర్భవిస్తూ, ప్రపంచమంతా కూడా ఎటువంటి సమస్యలనైనా ఎదుర్కొని ప్రగతి పథంలో నడుస్తుందని తెలియజేసారు. ప్రొఫెసర్ డి. జ్యోతి మాట్లాడుతూ సమాజాన్ని రక్షించేటువంటి రక్షకభటులకు యోగా ఒక రక్షణ కవచం వంటిద న్నారు. డా. లక్ష్మీనారాయణ శిబిరంలో పాల్గొన్నటువంటి పోలీసు ఉద్యోగులకు యోగాసనములను శ్వాసప్రాణాయామ ప్రక్రియలను వివరిస్తూ ప్రయోగాత్మ కముగా శిక్షణ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డి. శ్రీనివాసరావు ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆర్.ఐ.లు, ఆర్ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా నిషేదిత హారన్స్ తొలగించిన డ్రైవర్లు



**తిరుపతి కార్పొరేషన్, జూన్ 13 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో ట్రాఫిక్ డిఎస్పి సూచనల మేరకు స్వచ్ఛందంగా నిషేదిత హారన్స్ తొలగించిన జీప్, సుమో డ్రైవర్లు. జీప్ అండ్ సుమో అసోసియేషన్ నాయకుల ఆధ్వర్యంలో విష్ణు నివాసం వద్ద 50వాహనాల నిషేధత హారన్స్ డ్రైవర్లు తొలగించారు. గత కొన్ని రోజుల నుండి వివిధ ప్రదేశాల నుంచే వస్తున్న భక్తులకు నిషేదితహారన్ సౌండ్స్ ద్వారా ఇబ్బందులు కలుగుతున్నాయి అంటూ పోలీసులకు భక్తులు ఫిర్యాదు చేసారు. దీంతో అనేకమార్లు నిషేధిత హారంలో కలిగి ఉన్న జీపు, సుమోల డ్రైవర్లపై కేసులను ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది నమోదు చేసారు. టాఫిక్ పోలీస్ సిబ్బందికి సహకరించిన జీపు, సుమో డ్రైవర్లకు ట్రాఫిక్ డిఎస్పి ధన్యవాదాలు తెలిపారు. పోలీస్ నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత హారన్స్ ఎవరైనా కలిగి ఉంటే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవంటూ ట్రాఫిక్ డిఎస్పి హెచ్చరించారు.

## కలెక్టర్‌ను కలిసిన స్పోర్ట్స్ అధారిటీ అధికారి శశిధర్

**తిరుపతి క్రీడ, జూన్ 13 ప్రభాతవార్త:**

జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన శశిధర్ శుక్రవారం జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌ని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి శశిధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## పెన్షనర్ల సమస్యలపై స్పందించండి!



**శ్రీకాళహస్తి,జూన్ 13 ప్రభాతవార్త:** పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించటం లేదని ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు తల్లడిల్లుతున్నారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన సమావేశంలో పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం అధ్యక్షులు బి.వెంకయ్య అధ్యక్షతన జరిగింది. పెన్షనర్ల భవనంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దదాటిని పెన్షనర్ల సమస్యలను పట్టించుకోవటం లేదని వాపోయాకు.ముఖ్యంగా డిఏ బకాయిలు, 12వ పిఆర్‌సి,అదనపు పెన్షన్లు, కమ్యూటేషన్ ఇచ్చినట్లే ఇచ్చి రికవరి చేస్తున్నారని ఈ సమస్యలు ఎంతో కాలంగా ఉన్నా గత ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులపై చిన్న చూపు చూసారని ప్రభుత్వం కూటమి ప్రభుత్వం కకూడా పట్టించుకోవటం లేదన్నారు. ప్రభుత్వాలు ఉద్యోగుల సేవలను ఉపయోగించు కుంటూ రిటైర్డ్ అయిన తరువాత పట్టించుకోవటం లేదని ఆవేధన వ్యక్తం చేసారు.ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు పి.సత్య నారాయణ రావు, జయానందం, ఎల్లప్ప, ప్రసాద్, సుబ్బారావు, సుబ్రమణ్యం రెడ్డి,షణ్ముగం, ప్రభాకర్‌రావు, సుధాకర్ జహీర్‌బాషా, భక్తవత్సలం,దుర్గా ప్రసాద్, నాగరాజు, సవి జయంతి,రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీకాళహస్తిలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల ప్రబంధకారిణి అధ్యక్షులుగా చాగనం భక్తవత్సలంను ఎన్నుకోవటంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయన్ను సత్కరించారు.

## స్వర్గ ప్రాప్తి కోసం ఆరాధన అవసరం:రేహాన్



**శ్రీకాళహస్తి,జూన్ 13 ప్రభాతవార్త:** ఇహలోకం మనిషికి మజిలి అని ఇక్కడ మనం చేసే మంచి,పుణ్య కార్యక్రమాలను మనల్ని స్వర్గస్తుల్ని చేస్తుందని అందుకు ప్రతి ఒక్కరు నిరంతరం అల్లాహ్ ఆరాధనలోగడపాలని హాఫీజే ఖుర్ అన్ రేహాన్ సాహెబ్ పిలుపు నిచ్చారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన జీవిత సత్యం గురించి వివరించారు. మనం ఇక్కడ అతిధులుగా వచ్చామన్నారు. ఈ జీవితం శాశ్వతం కాదని, మనం మృతి చెందిన తరువాత అసలైన జీవతం ఉంటుందన్నారు. మనం స్వర్గస్తులు కావాలంటే నిత్యం అల్లాహ్ ఆరాధనలో గడపాలన్నారు. స్వర్గానికి వెళ్ళాలంటే అందుకు దైవారాధనలో గడపాలని సూచించారు

## బాలకార్మిక రహిత సమాజం కోసం పాటుపడదాం



**శ్రీకాళహస్తి,జూన్ 13 ప్రభాతవార్త:** బాలకార్మిక రహిత సమాజాన్ని నిర్మించు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి.రమణ అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలో బాల కార్మికుల రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా పట్టణంలో పలు తనిఖీలు చేసారు.ప్రగతి సంస్థ పట్టణ పోలీసు,లైవ్ శాఖలు వివిధ వస్త్ర దుకాణాలు,హోటల్స్‌లో బాల కార్మికులుఎవరైనా పని చేస్తున్నారా? అని తనిఖీలు చేసారు. ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో నినాదాలు చేసారు.ఈ రోజు తనిఖీల్లో 18 మంది బాల కార్మికులు పని చేస్తున్నట్లు గుర్తించారు.దుకాణ యజమానులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ కమిషనర్ చిన్నలారెన్స్, కార్మిక శాఖ అధికారులు శ్రీమన్నారాయణ, రంగనాధం, ప్రవీణ్‌కుమార్, ప్రగతి సంస్థ తిరుపతి జిల్లా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ రాజారెడ్డి, మండల కోఆర్డినేటర్ జయలక్ష్మీ, సుభాష్, శిరీష, రామచంద్ర ప్రభాకర్, రాష్ట్రా యానాది సంఘం అధ్యక్షులు చందమామల కోటయ్య, మధుకుమార్,లత, ముని, రేణుక సిఆర్‌పి మునిమోహన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బలిజలను బిసీల్లో చేర్చాలి



**శ్రీకాళహస్తి,జూన్ 13 ప్రభాతవార్త:** బలిజలను బిసిల్లోకి చేర్చాలని చిత్తూరు నుండి అమరావతి వరకు ఒంగోలుకు చెందిన సానప్రసాద్ రాయల్ అమరావతి పాదయాత్ర చేపట్టారు. శుక్రవారం ఆయనకు శ్రీకాళహస్తి పట్టణంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బలిజ సంఘం నాయకులు పట్టణంలోని రాయల్ గోపురం వద్ద శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి పాదయాత్ర మొదలు పెట్టారు. ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ఒంగోలుకు చెందిన సాన ప్రసాద్ చిత్తూరు నుండి అమరావతి వరకు బలిజల దశాబ్ధాల కోరిక అయిన బిసిల్లో చేర్చాలని, ఈ నినాదం ఇప్పుడు ఏర్పడినదు కాదు అని, అనేక మంది అనేక మార్లు ప్రయత్నించారన్నారు. మంజునాధ కమిషన్ కూడా బలిజలకు సహకరించినప్పుటికీ ఇప్పటి వరకు రిజర్వేషన్ ఏర్పాటు చేయలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య ఒక దళిత ముఖ్యమంత్రిగా వున్న వ్యక్తి, ఈ రాష్ట్రంలోని బిలిజలకు బిసిల్లో చేర్చిన విషయం మనమందరికీ విధితమే. ఆ తరువాత వచ్చిన ముఖ్యమంత్రులు ఏదో ఒక విధంగా రిజర్వేషన్ వుంటే బలిజులు అన్ని విధాలుగా రాజకీయంగా, ఆర్థికంగా, ఉద్యోగ పరంగా అభివృద్ధి చెందుతారని భావిస్తూ ఏ ముఖ్యమంత్రి కూడా నిర్ణయంతీసుకోలేదన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు ఉప్పు క్రిష్ణయ్య, పూల క్రిష్ణమూర్తి, స్వర్ణమూర్తి, సిద్ధులుగారి ప్రసాద్, దండురాఘవులు, నరసయ్య, అంజూరు వెంకటేష్‌బాబు, శ్రీపురం సుధాకర్, ఉత్తరాజి శరవణ కుమార్, మున్నారాయల్, జయశ్యాం, శ్రీవారి సురేష్, కంఠా ఉదయ్, పసుపులేటి నవీన్, గణేష్, చింతామణి పాండు, చిలకా గోపి, కుమార్, మైనంపాటి మస్తాన్, కండ్రిగ భాస్కర్, తేజ, గంగాధరం, క్రిష్ణ, రమేష్, సతీష్, సుబ్రమణ్యం, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారం



**శ్రీకాళహస్తిరూరల్, జూన్ 13 ప్రభాతవార్త:** ఏర్పేడు మండలంలోని మడిబాక పంచాయితీలోని రాజులకండ్రిగ గ్రామంలో కొద్దిరోజులుగా గ్రామస్తులు నీటి సమస్యతో సతమతమౌతున్నారు. గ్రామస్తులు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజనాయుడుకు సమస్యను తెలిపారు. ఆయన వెంటనే స్పందించి మండల ఎంపిడిఓ సౌభాగ్యమ్మకు సమస్యను తెలియజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వెంటనే మండలాధికారులు గ్రామంలో త్రాగునీటి సమస్య కోసం బోర్ వేయించారు. సమస్యను పరిష్కరించినందులకు గ్రామస్తులు పార్టీ మండలాధ్యక్షునికి ధన్యవాదాలు తెలిపి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ సుబ్రమణ్యం, మడిబాక మాజీ సర్పంచ్ రాయపనేని రఘునాయుడు, సుబ్రమణ్యం రాజు, రాజుల కండ్రిగ క్లస్టర్ ఇన్‌చార్జి మురళీరాజు, శ్రీనివాసరాజు, పట్టాభిరాజు, మాధవరాజు, వరదరాజులు, వీర్రాఘవులు, దేశం నాయకులు పాల్గొన్నారు.

## శునకాల జనన నియంత్రణపై ముగిసిన శిక్షణ



**తిరుపతి విద్య, జూన్ 13 ప్రభాతవార్త:** అనిమల్ కేర్ ల్యాండ్, వరల్డ్ వైడ్ వెటర్నరీ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో శునకాల జనన నియంత్రణ శస్త్ర చికిత్సలపై రెండు వారాల పాటు వెటర్నరీ వైద్యులకు తుకివాకంలో జరిగిన శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ జేవీ రమణ హాజరై శిక్షణ పొందిన పశు వైద్యులకు ధృవపత్రాలను అందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ భారత జంతు సంక్షేమ సంస్థ నిర్ధేశించిన ప్రొటోకాల్ ప్రకారం శునకాల శస్త్ర చికిత్స విధానాలపై పశువైద్యులకు శిక్షణ ఇవ్వడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు.వైద్యులు శునకాల జనన నియంత్రణపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకుని స్థానిక పురపాలక శాఖకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఔరంగాబాద్ నుంచి వచ్చిన శిక్షకులు డాక్టర్ యుగంధర్ నాయుడు, డాక్టర్ నవీన్,అనిమల్ కేర్ ల్యాండ్ పశువైద్యులు డాక్టర్ యజ్ఞ,మున్సిపల్ వెటర్నరీ అధికారి డాక్టర్ నాగేంద్రరెడ్డి,పశువైద్యులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐ ఉద్యోగుల రక్తదానం



**తిరుపతి విద్య, జూన్ 13 ప్రభాతవార్త:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరుపతి అడ్మినిస్ట్రేటివ్ రీజినల్ ఆఫీస్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. సామాజిక బాధ్యత పట్ల నిబద్ధతకు ఇది ఒక అద్భుతమైన ప్రదర్శనని జూలై 1న జరిగే వార్షిక బ్యాంక్ డే వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఎస్బిఐ ఆర్ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ డే శుభ సందర్భంగా ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం మాకు చాలా గర్వంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని రక్తదానం మరొకరికి ప్రాణదానమని పేర్కొన్నారు.ఈ శిబిరంలో వంద మందికి పైగా సిబ్బంది రక్తదానం చేశారని తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ ప్రాంగణంలో జరిగిన ఈ శిబిరానికి ఉద్యోగుల నుండి ఉత్సాహభరితమైన స్పందన లభించిందని ఆయన తెలిపారు. ఎస్బిఐ సిబ్బందిపాల్గొన్నారు.

## నేటి నుండి విద్యార్థులకు కొత్త బస్సుపాసులు జారీ

**తిరుపతి(రవాణ),జూన్ 13ప్రభాతవార్త :** నూతన విద్యాసంవత్సరం 2025– 26కు సంబంధించి ఏపిఎస్‌ఆర్టీసి బస్సు పాసులు జూన్ 14వతేదీ నుండి జారీ చేయబడతాయి. 12,13 తేదల్లో బస్సుపాసు వెబ్‌సైట్ సాంకేతికమైన అనుసంధానం, నవీనీకరణ చేపట్టడంతో జారీచేయలేదు. ఈ క్రమంలో అన్ని బస్సు పాసులు, కొత్త బస్సుపాసులు 14వతేదీ నుండి జారీ చేయబడతాయి. శనివారం నుండి బస్సుపాసు కౌంటర్లలో పాసుల జారీ పునఃప్రారంభమవుతుంది.

## పౌరాణిక శిరోమణి కృష్ణమూర్తికి సన్మానం



**తిరుపతి(రవాణ),జూన్ 13ప్రభాతవార్త:** తిరుపతి అన్నమాచ్యాకళామందిరం వేదికగా జాతీయ గీత ప్రచార సమితి టిటిడి సంయుక్తంగా ఉపనిషత్తుల సందేశాన్ని నిర్వహించాయి. 12గంటలపాటు ఉపనిషత్తుల సారాన్ని భక్తులకు నిర్విరామంగా పౌరాణిక శిరోమణి పొన్నా కృష్ణమూర్తి వినిపించారు. ఈ సందర్భంగా రాలయసీమ రంగస్థలి కళాఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, మల్లారపు రవిప్రసాద్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, నాగేశ్వరరావు, కొట్టే సుబ్రమణ్యంరెడ్డి, టీచర్ తిరుమలయ్య, కళామందిరం కో ఆర్డినేటర్ కోకిలపాల్గొని సన్మానించారు.

# తిరుపతి డివిజన్

## అపోలో ఆసుపత్రిలో చిన్న పిల్లలకు సురక్షితమైన ఆధునిక వైద్యం

– అపోలో పిఐసియు హెచ్ఒడి డాక్టర్ రాజేశ్వరి నాయక్



**తిరుపతిరూరల్, జూన్13 ప్రభాతవార్త:** చెన్నై అపోలో ఆసుపత్రిలో చిన్న పిల్లలకు అత్యాధునికి సురక్షితమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు అపోలో పిఐసియు హెచ్ఒడి డాక్టర్ రాజేశ్వరి నాయక్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. చిన్న పిల్లల శస్త్ర చికిత్సలో 100శాతం విజయం సాధించడమే అపోలో ఆసుపత్రి ప్రత్యేకతని తెలిపారు. పిడియాట్రిక్నాలజీ, నెఫ్రాలజీ, పలమనాలజీ సర్జరీ వంటి ప్రత్యేక వైద్య నిపుణుల సంప్రదింపులు కలిగి ఉండటమే కాకుండా అత్యాధునికి టెక్నాలజీ ఉండటంతో ప్రాణాపాయ క్లిష్టపరిస్థితులలో వచ్చిన చిన్నారులను కూడా సంరక్షించినట్లు తెలిపారు. తిరుపతికి చెందిన 13 ఏళ్ల వశిష్టసాయి, మూడేళ్ళ నిత్యశ్రీకి ఎంతో క్లిష్టమైన ఆపరేషన్‌లు సైతం విజయవంతంగా నిర్వహించగలిగినట్లు తెలిపారు. తక్కువ రక్తకణాల వల్ల రక్తస్రావం కలిగిన పిల్లలకు ప్రాణం పోషినట్లు తెలిపారు. అత్యంత ప్రమాదకరమైన స్థితిలో ఉన్న చిన్నారికి దాదాపు 20రోజులకుపైగా వైద్యం అందించి, పూర్తిగా కోలుకోవడం జరిగిందని తెలిపారు. పోలో హస్పిటల్ యూనిట్ హెడ్ రంజని, వైద్యబృందం డాక్టర్ సుచిత్రరంజిత్, డాక్టర్ చిదంబరం, డాక్టర్ ప్రియవర్ధిని, డాక్టర్ వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్య ప్రగతికి సోపానం

–టిడిపి అధికార ప్రతినిధి చినబాబు



**రామచంద్రాపురం, జూన్ 13 ప్రభాతవార్త:** విద్య దేశప్రగతికి సోపానమని టిడిపి అధికార ప్రతినిధి చినబాబు అన్నారు. శుక్రవారం సొరకాయలపాళ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్‌ను, పాఠ్యపుస్తకాలు, యూనిఫారమ్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రారంభమైన మొదటి రోజునే యూనిపారమ్, పాఠ్యపుస్తకాలు అందించడం గర్వించదగ్గ విషయమన్నారు. మరోవైపు అభివృద్ధి, సంక్షేమం గాడినపెడుతూ తల్లికి వందనం పథకం అందించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు హరిశంకర్, పూర్వవిద్యార్థి చెంగయ్య యాదవ్, మాజీ ఉప సర్పంచ్ చంద్రబాబు యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాస్ కె.వి.కెచే వికసిత్ కృషి సంకల్ప అభియాన్



**రేణిగుంట, మే 13 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం చైతన్య పురం రాస్ కె.వి.కె ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై గురువారం రేణిగుంట మండలంలోని గాజులమండ్యం,కరకంబాడి పంచాయతీ నందు జరిగింది. కార్యక్రమం లో భాగంగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ హెడ్ డాక్టర్ ఎస్.శ్రీనివాసులు, ఐసీ.ఏ.ఆర్ సీనియర్ శాస్త్రవేత్త మంజునాథ్ డి.ఆర్.సి వ్యవసాయ అధికారి శ్రీనివాసులు, పశు వైద్య శాస్త్రవేత్త డి.అనూష, గ్రామ సహాయక వ్యవసాయ అధికారులు సర్పంచులు పాల్గొన్నారు. రైతులకు రానున్న ఖరీఫ్ లో సాగు చేసే పంటలలో అధిక దిగుబడినిచ్చే రకాలు, ప్రధాన పంటలలో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు,వ్యవసాయంలో డ్రోన్ ల వినియోగం మొదలైన అంశాల గురించి అవగాహన కల్పించారు. రాస్ కెవికె ప్రధాన శాస్త్రవేత్త డా. ఎస్.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో కెవికె ద్వారా జరుగుతున్న పలు కార్యక్రమాలు, ప్రకృతి వ్యవస్నాయ,వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమ ఉద్దేశం గురించి రైతులకు క్లుప్తంగా వివరించారు.

## పిల్లల ప్రాథమిక హక్కులను హరించవద్దు



**రేణిగుంట, జూన్ 13 ప్రభాతవార్త:** చదువుకోవాల్సిన పిల్లల ప్రాథమిక హక్కులను హరించడం క్షమించరాని నేరమని ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి అన్నారు. రేణిగుంట మండలం చైతన్యపురం, గురవరాజు పల్లె గ్రామాలలో అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ గురువారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ చదువుకోవలసిన బాలలను పనులలో పెట్టుకోవడం వారి ప్రాథమిక హక్కులను రాజ్యాంగబద్ధంగా హరించడమేనని అన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నారాయణ, సంస్థ సిబ్బంది సురేష్, అంగన్వాడీ కార్యకర్త వరలక్ష్మి, హెల్పర్ నీరజ తదితరులు పాల్గొన్నారు

## మృతుడు పళిని కుటుంబానికి ఆర్థిక సాయం



**తిరుపతి కలెక్టరేట్, జూన్ 13 ప్రభాతవార్త :** చంద్రగిరి ఐతేపల్లికి చెందిన టువీలర్ మెకానిక్ పళని లివర్ దెబ్బతిని గురువారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకుని తిరుపతి జిల్లా టూవీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మృతుడి కుటుంబానికి రూ. 25వేలు అందజేశారు. టువీలర్స్ మెకానిక్స్‌కు వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడానికి అసోసియేషన్ ఎల్లప్పుడు ముందు ఉంటుందన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు ప్రభు,సెక్రటరీ జలంధర్,జాయింట్ సెక్రటరీ గురు ఆచారి,కమిటి ఇన్‌చార్జి కేశవ,చంద్రగిరి ఇన్‌చార్జి కుమార్,తేజారెడ్డి, అరుణ్ పాల్గొన్నారు.

## ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ల పరిశీలన



**తిరుపతి విద్య, జూన్ 13 ప్రభాతవార్త:** ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీపీజీసెట్ 2025లో భాగంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఎంపీఈడీ కోర్సులో ప్రవేశ పరీక్ష రాసిన అభ్యర్థుల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ధృవపత్రాల పరిశీలన శుక్రవారం ప్రారంభ మైంది. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో వీసీ అప్పారావు, కన్వీనర్ ప్రొఫసర్ పీసీ వెంకటేశ్వర్లు వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించారు.రెండు రోజుల పాటు జరగనున్న ఈ ప్రక్రియకు పరిశీలకులుగా నాగార్జున వర్సిటీ నుంచి ప్రొఫెసర్ పాల్, కృష్ణదేవరాయ వర్సిటీ నుంచి ప్రొఫెసర్ శ్రీనివాస్, యోగివేమన వర్సిటీ నుంచి ప్రొఫెసర్ రామసుబ్బారెడ్డి, ఎస్వీయూ నుంచి ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి వ్యవహరించనున్నారు.


కెనరా బ్యాంక్ Canara Bank Together we can

తిరుపతి ప్రధాన శాఖ-2, డి.నెం.5-5-303, సిద్దార్థ్ టవర్స్, ఎస్.డి.లేఔట్, తిరుపతి
తిరుపతి ఫోన్: 0877-2220741

**రుణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

టు తేదీ: 27.05.2025

రుణగ్రహీత: శ్రీమతి సుబ్బలక్ష్మి, భర్త ఎం.వెంకటేశులు డి.నెం.19-4-149/34, భగత్ సింగ్ కాలనీ, తిరుపతి – 517501

సహరుణగ్రహీత: శ్రీ వెంకటేశులు మందా తండ్రి కైలాసం మందా, డి.నెం.19-4-149/34, భగత్ సింగ్ కాలనీ, తిరుపతి – 517501

గ్యారంటార్: శ్రీమతి నిర్మల చింతల తండ్రి సి.నీలకంఠం నాయుడు లేట్, డి.నెం.20-2-507-డి5, కొర్లగుంట వీధి, మారుతీ నగర్, తిరుపతి – 517501

అయ్యా/ అమ్మా !

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం,2002 సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

మా కెనరాబ్యాంక్, తిరుపతి ప్రధాన -2 శాఖ నుండి మీరు శ్రీమతి సుబ్బలక్ష్మి, శ్రీ వెంకటేశులు మందా, శ్రీ నిర్మల చింతా కాలానుగుణంగా పొందిన లోన్/ రుణ సౌకర్యాల వివరములు

| రుణ స్వభావం | రుణం మొత్తం & ఖాతా నెంబరు | తేదీ: 30.04.2025 నాటికి బకాయిమొత్తం | వడ్డీ రేటు |
|---|---|---|---|
| మార్టగేజ్ లోన్ | రూ.24,90,000/– 31717830000570 | రూ.53,87,577.89 | 13.85% |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసు షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు/ ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో విఫలమైనందున బ్యాంకు సదరు ఋణాన్ని తేదీ: 20.05.2017 నిరర్థక ఆస్తిగా (ఎన్‌పిఏగా) వర్గీకరించినది. అందువలన ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా రూ.53,87,577.89 పై (యాభై మూడు లక్షల ఎనభై ఏడు వేల ఐదు వందల డెబ్బై ఏడు రూపాయల ఎనభై తొమ్మిది పైసలు మాత్రమే)లను + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసినదిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ నోటీసును జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కులను మేము వినియోగించుకుంటాము. అంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించ కుండా మీరు నిరోధింప బడుచున్నారు. సదరు చట్టం మరియు / లేదా అమలులో వున్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కులకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాల వ్యవధిని వినియోగించు కోగలరని సూచించడమైనది. మా శాఖ రికార్డులలో అందుబాటులో వున్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగినది.

షెడ్యూలు: తనఖాలో వున్న ఆస్తి యొక్క వివరములు దిగువ తెలుపబడినవి.: చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా తిరుపతి, తిరుపతి సబ్ జిల్లా, తిరుపతి అర్బన్ మండలం, తిరుపతి టౌన్ – మున్సిపల్ వార్డునెం.19, భగత్ సింగ్ కాలనీ, ఎస్టీవీ నగర్ రెసిడెన్షియల్ ఏరియా సర్వేనెం.239లో డి.నెం.19-4-149/34 గల నివాసయోగ్యమైన ఆర్.సి.సి. బిల్డింగ్ హద్దులు: తూర్పు: ఎన్.ఆదెమ్మ యొక్క డి.నెం.19-4-148 గల ఇల్లు, పడమర: ఉమాశంకర్ యొక్క డి.నెం.19-4-149/35 గల ఇల్లు, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: ఎస్.సుబ్రమణ్యం యొక్క డి.నెం.19-12-403 గల ఇల్లు, ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 17.50 అ.=5.337 మీ. ఉత్తరం నుండి దక్షిణం: 28అ. = 8.540 మీ. వెరశి మొత్తం విస్తీర్ణం 490 చ.అ. ఇందున వున్న డి.నెం..19-4-149/34 గల ఆర్.సి.సి. బిల్డింగ్

స్థలం : తిరుపతి
తేదీ: : 27.05.2025

సం॥ అధీకృత అధికారి,
కెనరా బ్యాంక్

# హామీలను నెరవేర్చకపోతే వైసిపిచే ఆందోళన

- నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి



వెంకటగిరి, జూన్ 13 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే వైసిపి పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్ జె ఆర్ భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అమ్మ ఒడి పథకం పేరును తల్లికి వందనం మార్చి తల్లుల ఖాతాలో 15 వేల రూపాయలు జమ చేస్తామని చెప్పిన హామీని నెరవేర్చ లేదన్నారు. 12వ తేదీ కల్లులు ఖాతాలో 15000 పడతాదని చెప్పి ఇంతవరకు వేయలేదు అన్నారు. 15000 రూపాయలు బదులు 13 వేల రూపాయలు వేస్తామని చెప్పినట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తామని చెప్పి ఆగస్టులో చేస్తామని చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. సంక్షేమ పథకాలు అమలు చేయకనే చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు అన్ని చూస్తున్నట్లు తెలిపారు. ప్రజలే కూటమి ప్రభుత్వానికి పొరపాటు చెప్తారని తెలిపారు. వైసిపి వారిపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట మునిసిపల్ చైర్పర్సన్ నక్క భానుప్రియ, వైస్ చైర్మన్ బాలయ్య, పార్టీ కన్వీనర్లు ప్రసాద్ రెడ్డి, చింతల శ్రీనివాసులు రెడ్డి, కె.శ్రీనివాసులు రెడ్డి, వైసిపి జిల్లా మాజీ కార్యదర్శి హరికృష్ణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## 3,900 కుటుంబాలకు అన్నదాత సుఖీభవ

కోట, జూన్ 13 ప్రభాతవార్త: రాష్ట్రప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం అమలు చేయడానికి సిద్ధమైంది. ఈ పథకం ద్వారా అర్హులైన రైతు కుటుంబాలకు ఏడాదికి రూ.20 వేలు మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందజేస్తారని వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ చెప్పారు. ఆ మేరకు అర్హుల జాబితా ఆయా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని చెప్పారు. జూన్ 20వ తేదీలోగా రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు. ఈకేవైసీ పూర్తి చేసుకున్న రైతులకు మాత్రమే ఈ పథకానికి సంబంధించిన నగదు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు.

## సూర్య ప్రభ వాహనంలో శ్రీ వెంకటేశ్వరుడు



గూడూరు, జూన్ 13 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు సూర్యప్రభ వాహనంలో భక్తులకు దర్శనమిచ్చారు. మాడ వీధి ఉత్సవం జరిగింది. అనంతరం ఆలయ ద్వారం వద్ద స్వామి అమ్మవార్లను నిలిపి లక్ష్మి సంవాదం ముసుగుల సేవ నిర్వహించారు. స్వామివారిపై అమ్మవారు అనుమానంతో వైకుంఠానికి రానివ్వకుండా అడ్డువేసి సంవాదం గురించి అర్చకులు తెలియజేశారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## విద్యార్థులకు నగదు పురస్కారం



చిల్లకూరు, జూన్ 13 ప్రభాతవార్త: మండలంలోని పాలిచర్ల వారి పాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి నందు ప్రతిభ చూపిన జి నవ్య 535 మార్కులు, టి తన్వి 529 మార్కులు, బి లోహిత్ 525 మార్కులు సాధించి పివిపి పాలెం ఉన్నత పాఠశాల నందు ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచారు. పాలిచర్ల వారి పాలెం గ్రామానికి నెలబల్లి రామచంద్రారెడ్డి మాజీ ఎల్విసి డెవలప్మెంట్ ఆఫీసర్ విద్యార్థుల ప్రతిభ గుర్తించి ప్రథమ స్థానంలో నిలిచిన నవ్య శ్రీ కు 5000 రూపాయలు, తన్వికి 3000 రూపాయలు, లోహిత్‌కు 2000 రూపాయలు నగదు పురస్కారాన్ని పంపిణీ చేయడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనసూయ మాట్లాడుతూ రామచంద్రరెడ్డి లండన్‌లో ఉన్న పదవ తరగతి విద్యార్థులు ప్రతిభను గుర్తించి నగదు పురస్కారం అందజేయడం ఎంతో అభినందించదగ్గ విషయమని, వారు పాఠశాలకు చేసిన సేవలు కూడా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ చంద్రశేఖర్, జి మాధవయ్య, దేశి రెడ్డి ప్రజేంద్ర రెడ్డి, విద్యుల్లత, మధుసూదన్ రావు, సుబ్రహ్మణ్యేశ్వర రావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆలయంలో సామూహిక పూజలు



వాకాడు, జూన్ 13 ప్రభాతవార్త: సమాజ క్షేమం కోసం షిరిడి సాయి అనుబంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా వాకాడు, కోట, చిట్టమూరు మండలాల సాయిబాబా ఆలయంలో సామూహిక పూజలు, హారతులు, తత్సంగం ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం వాకాడు, కోటలోని సాయిబాబా ఆలయాల్లో సంస్థ నిర్వాహకులతో పాటు అశేష భక్త బృందాలచే సాయిబాబా తత్సంగం, గురువలచే బాబా మహిమా అనుభవాలు, శాంతి పూజలు, అనంతరం అన్న ప్రసాదాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు గంగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఆలయ ధర్మకర్తలు విజయలక్ష్మి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మరాజుపల్లిలో విషాదఛాయలు



రామచంద్రాపురం, జూన్ 13 ప్రభాతవార్త: బెంగుళూరు సమీపంలోని హోస్కోట వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తిమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన ఒంటెల హరిబాబు కుమార్తెలు ప్రణతి (5) మృతి చెందగా, కామాక్షి (9)కి తీవ్రగాయాలయ్యాయి. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుము కున్నాయి. గ్రామస్థుల వివరాల మేరకు ఒంటెల హరిబాబు బెంగుళూరులో ఆర్మిలో పనిచేస్తూ అక్కడే నివాసం వుంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం స్వగ్రామంలో జరిగిన కుంభాళ కార్యక్రమానికి భార్య, ముగ్గురు పిల్లలతో గ్రామానికి వచ్చారు. కుంభాలు కార్యక్రమాన్ని ముగించుకుని గురువారం రాత్రి బెంగుళూరుకు పిల్లలు భార్య రోహిణి బయలుదేరారు. హోస్కోట వద్ద బస్సును టిప్పర్ ఢీకొనడంతో చిన్న కుమార్తె ప్రణతి అక్కడికక్కడే మృతి చెందగా, పెద్దకుమార్తె కామాక్షికి తీవ్రగాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హోస్కోటకు చేరుకున్నారు. తిమ్మరాజుపల్లిలో బంధువులు, కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

## సూర్య ప్రభ, చంద్రప్రభ వాహనాలపై శ్రీవారు





వడమాలపేట, జూన్ 13 ప్రభాతవార్త: అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 5 గంటలకు శ్రీవారికి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. అనంతరం 7.30-8 గంటల మధ్య శ్రీవారిని వాహన మండపంలోకి వేంచేపు చేశారు. అలంకరించిన సూర్యప్రభ వాహనంపై స్వామివారు బద్రి నారాయణ అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఊంజల్‌సేవ జరగనుంది, రాత్రి చంద్రప్రభ వాహనంపై కొలువుదీరిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వాహన సేవలో టీటీడీ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, కంకణ బట్టర్ తిప్పయాచార్యులు, రమణాచార్యులు, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

**ననేడు రథోత్సవం:**

అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం జరిగే రథోత్సవంను ఘనంగా నిర్వహించడానికి టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ప్రాథమిక పాఠశాల స్థాయిని కుదించొద్దు

- తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారికి వినతి

సత్యవేడు, జూన్ 13 ప్రభాతవార్త: పేరడంగ్రామంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాల స్థాయిని కుదించొద్దని తిరుపతి జిల్లా సత్యవేడు మండలం పేరడం గ్రామానికి చెందిన పిల్లల తల్లిదండ్రులు పలువురు మండల విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం పంచాయతీ సర్పంచ్ కనకరాజ్ ఆధ్వర్యంలో పలువురు పిల్లల తల్లిదండ్రులు మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో-2 ఉషను కలసి కొన్ని తరగతులను వేరే స్కూళ్ళలో విలీనం చేయడాన్ని ప్రస్తావించారు. మోడల్ స్కూలులో ముసుగులో ప్రాథమిక పాఠశాల స్థాయిని తగ్గించడం సహేతు కాదన్నారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లోనే 3,4,5 తరగతులను మదనంబేడు పాఠశాలల్లో విలీనం చేస్తే పిల్లలు చదువులకు దూరం అవుతారన్నారు. ప్రతి రోజు రెండు కి.మీ దూరం పిల్లలు వెళ్ళలేని పరిస్థితి ఉందన్నారు. పిల్లలకు ప్రమాదం పొంచి ఉందనడంలో సందేహం లేదన్నారు. దీని వల్ల ప్రభుత్వ బడులు భవిష్యత్‌లో మూతపడే అవకాశాలు ఉందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలలను యధావిధిగా కొనసాగించాలని కోరారు. ఎంఈవో-2 ఉష దీనిపై స్పందిస్తూ ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలుపుతామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు భూషణ, తిలకమ్మ, జ్యోతి, కృష్ణవేణి, నాగజ్యోతి, కన్నెమ్మ,మనీ, నాథముని తదితరులు పాల్గొన్నారు.

## చెస్ విజేతలను అభినందించిన నేదురుమల్లి



వెంకటగిరి, జూన్ 13 ప్రభాతవార్త: చెస్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులను వైసిపి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి అభినందించారు. విద్యార్థులను శాలువాతో ఆయన సత్కరించారు. కలువపూడి రేష్ మొదటి స్థానం, చింత గింజల నైనిక ఐదవ స్థానం, తాతగిరి కీర్తన, రెండవ స్థానం, కలవ కళ్ళు మధు శ్రీతన్ ఇంటర్నేషనల్ రేటెడ్ ప్లేయర్ ను ఓడించే అందర్ని ఆశ్చర్యపరిచారు. నెల్లూరులోని నక్షత్ర స్కూల్లో జాతీయస్థాయిలో జూన్ నెలలో చెస్ టోర్నమెంట్లు నిర్వహించారు. వెంకటగిరి విజయ్ చెస్ అకాడమీ లో ఈ విద్యార్థులు శిక్షణ పొందారు.

## తండ్రిపై కుమారుడు కత్తితో దాడి!



బాలాయపల్లి, జూన్ 13 ప్రభాతవార్త: విలమనూరు హరిజనవాడ లో తన తండ్రి మోడె హరిక్రిష్ణ పై కత్తి తో దాడి చేయబోయిన మోడె గిరిను అడ్డుకునే క్రమంలో మోడె సుబ్బయ్య, బుడతాటి పోలమ్మలు గాయాలయ్యాయి. తిరుపతి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలమ్మ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం బహిరంగ వేలం పాట



గూడూరు, జూన్ 13 ప్రభాతవార్త: చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నం గ్రామంలో వెలసిన శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానం నందు శుక్రవారం సీల్డ్ టెండర్లు మరియు బహిరంగ వేలం పాట నిర్వహించారు. అందులో భాగంగా భూమి లీజు హక్కుకు మాత్రం రెవిన్యూ వారు అభ్యంతరం తెలిపిన కారణంగా తాత్కాలికముగా వాయిదా వేయడమైనది. మిగిలిన రెండు టెండర్లు శ్రీస్వామి, అమ్మ వార్లకి ఉపయోగించిన వస్త్రములు సేకరించుకున్న హక్కుకు హెచ్చు పాట 52 వేలకు ఓ శ్రీనాథ్ బుచ్చిరెడ్డిపాలెం వారు పాడుకొనుట జరిగింది. సంవత్సరం పాటు స్వామివారికి నూతన వస్త్రములు మర్యాద వస్త్రములు సప్లై చేయుటకు లక్ష్మి శ్రీనివాస టెక్స్ టైల్స్, నెల్లూరు వారు తక్కువ టెండర్ వేయడం జరిగినది. పాటలకు కార్య నిర్వహణ అధికారి గిరి కృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ కోట సతీష్ కుమార్ యాదవ్, ఇన్స్పెక్టర్ శ్రీనివాస బాబు, ధర్మ కర్తలు భక్తాని రామయ్య, కొప్పల సుబ్రహ్మణ్యం, నెల్లిపూడి శివాజీ, కోడి పోలయ్య, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, టెండర్ దారులు పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన ఏఓ సుచేంద్రప్రసాద్



కోట, జూన్ 13 ప్రభాతవార్త: మండల వ్యవసాయ అధికారిగా సుచేంద్రప్రసాద్ శుక్రవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ చిట్టమూరు మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సుచేంద్రప్రసాద్‌ను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. రైతులకు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానని సుచేంద్రప్రసాద్ చెప్పారు.

## సిద్దవరంలో ఉచిత వైద్య శిబిరం



కోట, జూన్ 13 ప్రభాతవార్త: మండలం సిద్దవరం గ్రామంలో శుక్రవారం వైద్యాధికారి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ దినేష్, డాక్టర్ శివశంకర్‌లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వైద్యశిబిరంలో సూపర్‌వైజర్ భువనేశ్వరి, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య!



దొరవారిసత్రం, జూన్ 13 ప్రభాతవార్త: దొరవారిసత్రం మండల పరిధిలోని తనియాలి బ్రిడ్జి సమీపంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద వున్నా షెడ్డులో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది వివరాల్లోకెళితే అనంతపురం జిల్లా వాసి బ్రహ్మసముద్రం మండలం గుంగానిపల్లి గ్రామానికి చెందిన మృతుడు అజప్పగిరి ఈశ్వరప్ప 45 సంవత్సరాలు పోలీసులు గుర్తించారు అనంతరం ఎస్ఐ అజయ్ కుమార్ వీఆర్వో వరప్రసాద్ గ్రామస్తులు సమీక్షంలో మృదేహాన్ని పంచినామా నిమిత్తం సులూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అనంతరం పోలీస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## ప్రత్యేక ఆధార్ కేంద్రం ప్రారంభం

కోట, జూన్ 13 ప్రభాతవార్త: మండలం కొక్కుపాడు గ్రామంలో శుక్రవారం ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఎంపిడిఓ దిలీప్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలు అందాలంటే ఆధార్‌కార్డు తప్పనిసరి అని సూచించారు.

## ఎస్‌బిఐలో రక్తదాన శిబిరం



సూళ్లూరుపేట, జూన్ 13 ప్రభాతవార్త: పట్టణంలోని భారతీయ స్టేట్ బ్యాంకు శాఖలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భారతీయ స్టేట్ బ్యాంక్ డే సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భాగంగా ఏపీ వైద్య విధాన పరిషత్ సూళ్లూరుపేట సిబ్బంది, గోకులకృష్ణ కాలేజి సిబ్బంది, విద్యార్థుల సహకారంతో రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా చేపట్టారు. స్టేట్ బ్యాంక్ శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి కశిరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ అంబటి పృధ్వీరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏడిఎ పదవి బాధ్యతలు



చిట్టమూరు, జూన్ 13 ప్రభాతవార్త: వ్యవసాయ శాఖ నాయుడుపేట సబ్ డివిజన్ ఏడిఏగా నాగార్జునసాగర్ శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. గత కొంతకాలంగా చిట్టమూరు వ్యవసాయ అధికారి సుచేంద్రప్రసాద్ నాయుడుపేట ఏడిఏ గా పదవీ బాధ్యతలు నిర్వహించి ఆయన బదిలీపై కోటకు వెళ్లిన క్రమంలో నాగార్జునసాగర్ పదవి బాధ్యతలు చేపట్టారు. గత పది సంవత్సరాల క్రితం చిట్టమూరు వ్యవసాయ అధికారిగా కూడా నాగార్జునసాగర్ పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. అలాగే చిట్టమూరు వ్యవసాయ అధికారిగా నిరంజన్ కుమార్ కూడా పదవీ బాధ్యతలు చేపట్టడం పట్ల చిట్టమూరు మండల రైతు సేవ కేంద్ర వ్యవసాయ సహాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. జూన్ 21వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా ఆయా రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ సంబంధించిన నగదును మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుందని ఆయన తెలియజేశారు.

## ఉచిత టైలరింగ్ ఉచిత శిక్ష

పెళ్లకూరు జూన్ 13 ప్రభాతవార్త : జాతీయ కుట్టుమిషన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెళ్లకూరు మండలంలో స్థానికంగా ఉన్నచాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంది నిరుపేద మహిళల జీవనోపాధి కోసం టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి వారికి ఉచితంగా కుట్టు మిషన్ కూడా అందజేస్తుంది అదేవిధంగా పేదరికంలో ఉండే మహిళల్ని కాకుండా పురుషులకు కూడా టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చి జీవనోపాధి కల్పించాలని నిర్ణయించింది ఇందులో భాగంగా ఈ నెలలోనే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్న 5 నైపుణ్య అభివృద్ధి కేంద్రాలలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు దీనిలో శిక్షణ పొందడానికి పెళ్లకూరు మండలం తో పాటు నాయుడుపేట శ్రీకాళహస్తి వాసులకు వెంకటగిరి లో ఉన్న శిక్షణా కేంద్రంలో శిక్షణ ఇస్తారు ఆసక్తివున్న పురుషులు ఈ శిక్షణ శిబిరంలో శిక్షణ పొంది వారి అభివృద్ధినీ మెరుగుపరుచుకోవాలని ట్రస్ట్ అధినేత శ్రీ చాగణం గౌరీ శంకర్ కోరారు

## చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



కోట, జూన్ 13 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తమ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కోటలో సీఎం చంద్ర బాబు నాయుడు చిత్రపటానికి జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్నపాలెం సర్పంచ్ కె.మధుయాదవ్, ఎంపిటిసిలు షేక్ షంషుద్దిన్, దారా సురేష్, మహిళా నాయకురాలు సుహాసిని, పల్లం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు యోగా చేయాలి



బాలాయపల్లి, జూన్ 13 ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం యోగా చేయాలని పంచాయతీ కార్యదర్శి దయాకర్ తెలిపారు. మండలంలోని వెంగమాంబపురం సచివాలయంలో యోగా కార్యక్రమా న్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా చేయడం వల్ల అందరూ ఆరోగ్యంగా ఉంటారు అని చెప్పారు. యోగా చేయాలని తెలిపారు. యోగా చేయడం వల్ల మానవునికి వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజు 45 నిమిషాలు యోగ సాధన చేయాలని పిలుపునిచ్చారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ ధన్య తదితరులు పాల్గొన్నారు.

## 20వ తేదీ లోపల ఈకేవైసీ చేసుకుంటే పథకాలు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ ప్రసాదరావు

వెంకటగిరి, జూన్ 13, ప్రభాతవార్త: ఈనెల 20వ తేదీ లోపల ఈ కేవైసీ చేసుకున్న రైతులకు ప్రభుత్వ పథకాలు అందుతాయి అని లేకుంటే రావని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ ప్రసాదరావు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ, పి.యం.కిసాన్ పథకం అమలు చేయుటకు సిద్ధమైనది అని చెప్పారు.ఈ పథకం ద్వారా అర్హులైన రైతు కుటుంబాలకు ఏడాదికి 20 వేల రూపాయలు 3 విడతలలో ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలిపారు. తిరుపతి జిల్లాలో లక్ష 45 వేల 360 రైతు కుటుంబాలను ప్రభుత్వం ఈ పథకానికి అర్హులుగా గుర్తించడం జరిగింది అని చెప్పారు. అర్హులైన వారి జాబితా ఆయా రైతు సేవా కేంద్రాల సిబ్బంది వద్ద అందుబాటులో ఉంటుంది వివరించారు. కావున రైతులు వారికి సంబంధించిన రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి 20 జూన్ 2025 లోపు ఈ కె.వై.సి పూర్తి చేసుకోవాలని, ఈ కె.వై.సి పూర్తి చేసుకున్న రైతులకు మాత్రమే ఈ పథకానికి సంబంధ్నిచిన నగదు బ్యాంకు ఖాతాలలో జమ చేయటం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 3180 మంది రైతులు ఈ కే వై సి పూర్తి చేసుకున్నారని ఆయన ఎవరు ఇచ్చారు.

## వసతి గృహాన్ని పరిశీలించిన తహశీల్దార్



వాకాడు, జూన్ 13 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడులో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం, ప్రభుత్వ వసతి గృహమును శుక్రవారం తహశీల్దార్ రామయ్య పరిశీలించారు. వాకాడులో ఉన్న బీసీ హాస్టల్‌ను పరిశీలించి, పనిచేస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు, ప్రభుత్వ వసతి గృహంలో ఎంతమంది పిల్లలు ఉన్నారు. వారికి కావాల్సిన వసతులను అందజేస్తున్నారా పూర్తిస్థాయిలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గురుకులంలోని వంట సాల, టాయిలెట్లను, తదితర రూములను రామయ్య పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట విఆర్ఓ నెల్సన్, హాస్టల్ సిబ్బంది గాయం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

### కుటుంబ కలహాలతో బిక్కు బిక్కు...

## పోలీసు పహారాలో కుటుంబాలు



శ్రీకాళహస్తిరూరల్, జూన్ 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం ఎంపేడు గ్రామానికి సమీపంలోని షికారిల కాలనీలో ఉద్రిక్తత పరిస్థితి చోటు చేసుకుంది. వారం రోజులుగా పోలీసు, రెవెన్యూ,పంచాయతీ అధికారులు ఇక్కడ పంచాయతీలు జరిపినట్లు సమాచారం. ఎంపేడు పంచాయతీలోని వెంకటగిరికి సమీపంలోని షికారి కాలనీలో సుమారు వంద కుటుంబాలు నివాస ముంటున్నాయి. గతంలో ఇక్కడ పది నుంచి 15 కుటుంబాలు ఉండేవి. అయితే వారికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో పక్కాగృహాలు నిర్మించారు. నేడు గ్రామం కంటే కాలనీలోనే అత్యధిక కుటుంబాలు నివాసముంటున్నాయి. మారుతున్న వాతావరణం, రాజకీయాలతో రెండుగా విడిపోయారు. అధిపత్యపోరు చోటు చేసుకకుంది. ఈ నేపథ్యంలో గత ఐదేళ్ళ క్రితం నుంచి ఇక్కడ రాజకీయాలు చోటు చేసుకొని రెండు వర్గాలుగా విడిపోయారు. 2020లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఈ పంచాయతీని ఎస్‌టిలకు కేటాయించగా ఇక్కడ ఓ వ్యక్తిని సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. మరి కొందరు వ్యతిరేకమయ్యారు. అప్పటి నుంచి వర్గపోరు చోటు చేసుకుంది. సర్పంచ్ వర్గం, వ్యతిరేక వర్గం తయారైంది.

**డివైయస్‌పి వివరణ:**

ఈ సంఘటనలకు సంబంధించి ప్రభాతవార్త శ్రీకాళహస్తి డివైయస్‌పి నరసింహామూర్తికి వివరణ కోరగా ఆయన ఇలా తెలిపారు. షికారిలో జీవనోపాధి కోసం బయట వెళ్ళటం ఆనవాయితి అని అయితే కొందరు తమకు రక్షణ కల్పించాలంటూ కోరగా తాను, ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, తహశీల్దార్ నరసింహారావులు ఇరువర్గాలతో సమీక్షలు జరిపారు. ముందుజాగ్రత్తగా ఇరువర్గాల మధ్య మళ్ళీ గొడవలు రాకుండా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసామని సిసి కెమెరాలు,డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసామన్నారు. కొందరిని ఎంఆర్‌ఓ వద్ద బైండోవర్ చేసామన్నారు.



జిల్లా పరిషత్ డెప్యూటీ సీఈఓగా బాధ్యతలు స్వీకరించి మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లో కలిసిన జి. వెంకట నారాయణ



జిల్లా కో-ఆపరేటివ్ అధికారిగా బాధ్యతలు స్వీకరించి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్.వి నాగవర్ధన

## తిరుపతిలో మరో సైబర్ మోసం

### బెంగుళూర్ పోలీసుల పేరుతో విశ్రాంత ఉద్యోగిని మోసం

తిరుపతి,జూన్ 13ప్రభాతవార్త: మీ భార్య మానవ అక్రమ వాణాకేసులో నిందితురాలుగా ఉందని, మేము బెంగుళూర్ పోలీసులు, సిబిఐ అధికారులు పేరుతో ఓ విశ్రాంత ఉద్యోగిని బెదిరించి బ్యాంకు ఖాతానుండి 32లక్షలు రూపాయలు కాజేశారు. ఈ ఉదంతంపై బాధితుడు ఆలస్యంగా ఈస్టు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. ఈస్టు ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదు చేశారు. తిరుపతి రాఘవేంద్రనగర్‌లో విశ్రాంత ఉద్యోగి వెంకటరమణ బాబు నివాసముంటున్నాడు. కొద్దిరోజులుగా ఆయనకు సైబర్ ముఠా వాట్సాప్‌కాల్ చేసి మీ భార్య మానవ అక్రమరవాణాలో ఉందని, బ్యాంకు అకౌంట్ వివరాలు చెప్పాలని బెదిరించారు. కేసు నుండి బయట పడాలంటే తమకు సహకరించాలని బెదిరించారు. దీన్ని నిజమేనని నమ్మిన వెంకటరమణబాబు బ్యాంకు అకౌంట్ వివరాలు చెప్పడంతో 3సార్లు 32లక్షలు రూపాయలు సైబర్‌నేరగాళ్ళు కాజేశారు. బ్యాంకులో డబ్బులు డ్రాజరగడంతో మోసపోయానని బాధితుడు ఈస్టుపోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.